ప్రజాశక్తి
మంగళవారం 12 డిసెంబర్ 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు

నిధుల విడుదలపై గరం..గరం

- హోర్డింగ్‌ల నిర్వహణలో అక్రమాలపై ధ్వజం
- పారిశుధ్యం అధ్వానంగా ఉందన్న కార్పొరేటర్లు
- వాడివేడిగా గుంటూరు కౌన్సిల్

పరస్పరం విమర్శించుకుంటున్న కౌన్సిలర్లు.. వారిస్తున్న మేయర్ మనోహర్‌నాయుడు (ఇన్‌సెట్)

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం సోమవారం వాడీవేడిగా జరిగింది. సమావేశానికి మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షత వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటలవరకు సమావేశం కొనసాగింది. తొలుత సమావేశం ప్రారంభం కాగానే గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఎటిఆర్ ఇవ్వలేదని కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, రోషన్ ధ్వజమెత్తారు. రెండు వారాల్లో ఎటిఆర్ నివేదిక ఇవ్వాలని మేయర్ అధికారులను ఆదేశించారు. తన వార్డుకు తాగునీటి సమస్య పరిష్కరించనందుకు నిరసనగా టిడిపి కార్పొరేటరు నూకవరపు బాలాజీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. నగరంలో పలు సమస్యలపై టిడిపి, వైసిపి కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. గోరంట్ల మంచినీటి పథకాన్ని మేయర్, కమిషనర్ ఇంత వరకు పరిశీలన చేయలేదన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నాపట్టించుకోవడం లేదని పలువురు టిడిపి కార్పొరేటర్లు ధ్వజమెత్తారు.

ప్రధానంగా అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుల్లో జరుగుతున్న జాప్యంపై కమిషనర్‌కు, మేయర్‌కు మధ్య ఉన్న అంతరాలు ఈ సమావేశంలో బయటపడ్డాయి. నిధులు ఎలా విడుదల చేయాలనే అంశంపై మేయర్, ఇతర ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటే తాను ఈ నిర్ణయం అమలు చేస్తానని కమిషనర్ చేకూరి కీర్తి చెప్పారు. నిధుల విడుదలలో నెలకొన్న లోపాల వల్ల నగరంలోని అన్ని వార్డుల్లో రూ.100 కోట్ల మేరకు పనులు

▶ 2లో

ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి : కెఎస్

నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరా వు కోరారు. నగరంలో ఐదు రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్‌యూబి, ఆర్వోబిల నిర్మాణం కోసం చర్యలు తీసుకో వాలన్నారు. వీటిపై సర్వే జరుగుతోందని ఈనెల 5వ తేదీన రైల్వే అధికారులతో మాట్లాడనని తెలిపారు. శంకర్‌విలాస్ బ్రిడ్జి విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌యుబిలకు అవకాశం లేదని రైల్వే వారు చెప్పారని కమిషనర్ చేకూర్తి కీర్తి చెప్పగా ఆర్‌వోబిలు నిర్మిస్తే శ్యామలానగర్ దాదాపు 500 ఇళ్లు తొలగించాల్సి వస్తుందని ఆర్‌యుబి అయితే ఐదారు వరకు ఉంటాయని అన్నారు. గోరంట్ల నీటి పథకం ప్రారంభించడానికి ఉన్న అడ్డుం కులు ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఫిల్టరే షన్ ప్లాంట్ నిర్మాణం జరగాల్సి ఉందని అధికారులు తెలిపారు. త్వరగా ఈ పనులు పూర్తిచేయాలని లక్ష్మణరావు కోరారు. తాగునీటి సరఫరాలో తరచూ అంతరా యాలు ఏర్పడుతున్నాయని ప్రజల అవస రం మేరకు ఎందుకు సరఫరా చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. నీటి సరఫరా మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామని, సూపర్‌వైజరీ కంట్రోలు, డేటా అక్విజేషన్ (స్కాడా) ఏర్పాటుతో లోపాలు సరిచేస్తామని అధికారులు తెలిపారు.

మంగళగిరిలో నిరసన తెలుపుతున్న ఆళ్ల రామకృష్ణారెడ్డి అభిమానులు

వైసిపి ఎమ్మెల్యేలకు జంబ్లింగ్!

- అభ్యర్థుల ఎంపికపై వేగంగా అడుగులు
- ఎనిమిది నియోజకవర్గాల్లో కొత్త ఇన్‌ఛార్జిలు
- తాడికొండకు సుచరిత, గుంటూరు పశ్చిమకు రజిని, మంగళగిరికి గంజి చిరంజీవి, నాగార్జునకు సంతనూతలపాడు
- ఎమ్మెల్యే ఆర్‌కె రాజీనామాతో కలకలం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో అధికారపార్టీలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. నియోజకవర్గాల్లో ప్రతికూలతలు పెరుగుతుండటం వల్ల వైసిపికి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులకు జంబ్లింగ్ విధానం అమలు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో స్థానికంగా వ్యతిరేకత ఉన్న వారిని మరొక నియోజకవర్గానికి పంపుతున్నారు. సామాజిక సమీకరణలు, టిడిపి అభ్యర్థులను ధీటుగా ఎదుర్కొవాలనే వ్యూహరచనతో ఒకేరోజు 8 నియోజకవర్గాల్లో కొత్త ఇన్‌ఛార్జిలను ప్రకటించారు. మరోవారంలో మరికొంతమందిని కూడా ఇదే జంబ్లింగ్ పద్ధతిలో మార్పు చేస్తారని వైసిపి వర్గాలు తెలిపాయి.

మంగళగిరి నియోజకవర్గానికి ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిని ఇన్‌ఛార్జిగా ప్రకటిస్తున్నారని

▶ 2లో

రైతులకు పరిహారం ఇవ్వాలని 14న అఖిలపక్షం ధర్నా 2వ పేజీ

సచివాలయ సిబ్బందిపై వైసిపి నాయకుని దాడి 2వ పేజీ

పత్తి పంట అమ్ముకోవడానికి అగచాట్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తమ పంటను అమ్ముకోవడానికి సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన మిల్లు ఎదుట పత్తి రైతులు పడిగాపులు పడుతున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు చేయాల్సి ఉండగా అమరావతి మేజర్ కాల్వ సమీపంలో ఉన్న వెంకటరమణ జిన్నింగ్ మిల్లును సిసిఐ కేటాయించింది. ఈ మిల్లులో ఖాళీ లేకపోవడంతో పత్తి బోరాలతో వచ్చిన వాహనాలు మిల్లు ఎదుట రోడ్డుపై బారులు తీరాయి. పత్తి కొనుగోలు చేయకపోటంతో పంటను విక్రయించేందుకు వచ్చిన రైతులు మిల్లు ఎదుట పడిగాపులు పడుతున్నారు. సోమవారం తెల్లవారుజామున నుండే వాహనాలు నిలిచిపోయాయి. సుమారు 35 వాహనాలు రోడ్డు మీద నిలిచాయి. సూమారు వెయ్యి బోరాలు రైతులు తీసుకొచ్చారు. పత్తి బోరాలు దిగుమతి కాకపోవటంతో వాహనదారులు వెయిటింగ్ చార్జీలు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. మార్కెట్ యార్డులోనే పత్తి కొనుగోలు చేయాలని కోరుతున్నారు. సిసిఐ బయ్యర్ రవిప్రసాద్‌ను వివరణ కోరగా జిన్నింగ్ మిల్లులో దిగుమతి చేసేందుకు ఖాళీ లేకపోవడంతో కొనుగోళ్లకు ఆటంకం ఏర్పడిందని చెప్పారు.



రైతులకు పరిహారం ఇవ్వాలని 14న అఖిలపక్షం ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

మిచౌంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సిపిఐ ఆధ్వర్యంలో ఆపార్టీ జిల్లా అధ్యక్షులు జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.మస్తాన్‌వలి, సిపిఎం జిల్లా నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, జనతాదళ్ నాయకులు సాంబశివరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివాజీ తదితరులు ప్రసంగించారు. తుపాను రైతులకు నష్టాన్ని మిగిల్చిందని, వేలాది రూపాయాలు పెట్టుబడి పెట్టి, చేతికొచ్చిన పంట నీటమునిగి నష్టపోయారన్నారు. ప్రతి రైతునూ ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నష్టపోయిన వారిలో కౌలు రైతులు అధికంగా ఉన్నారని, వారినీ ఆదుకోవాలని కోరారు. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం త్వరితగతిన నష్ట అంచనాలు పూర్తి చేసి, రైతులందర్నీ ఆదుకోవాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు కోటా మాల్యాద్రి, పి.సత్యనారాయణ, ఎ.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

ప్రజాశక్తి - నరసరావుపేట : పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సిపిఐ కార్యాలయంలో సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్‌కుమార్ అధ్యక్షతన వహించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ కరువు పరిస్థితులతో అల్లాడుతున్న రైతులపై రోకటిపోటులా తుపాను విరుచుకుపడిందన్నారు. అయినా ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. తుపాను బాధిత ఇతర రైతాంగ సమస్యలపై పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ 14వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కార్యాలయాల వద్ద రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని తీర్మానించినట్లు చెప్పారు. పంటలు నష్టపోయిన రైతులకు వరి ఎకరాకు రూ.40 వేలు, మెట్ట పంటలకు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.60 వేల రూపాయలు, బిందు సేద్యం పంటలకు ఎకరాకు రూ.లక్ష కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మారుతి వరప్రసాద్, కె.రాంబాబు, కె.రామారావు, జి.శేఖర్, యు.రాము, టి.బాబురావు, అద్రూఫ్, ఎస్.ఎం బాషా, మస్తాన్‌వలి, జాన్ పాల్, వై.వెంకటేశ్వరరావు, సుభాని, కోట నాయక్, శ్రీను నాయక్, బి.శ్రీనివాస్, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈ - క్రాప్‌లో నమోదు చేయని పంటలకూ పరిహారమివ్వాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మిచౌంగ్ తుపానుతో మిర్చి, పత్తి, పొగాకు వంటి వాణిజ్య పంటలతోపాటు ఉద్యాన పంటలు సాగు చేపట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి నష్టపరిహారం దక్కుతుంతనే భరోసా ప్రభుత్వం కల్పించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ కోరారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సోమవారం కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు అధ్యక్షత వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ పంటలు సాగుచేసిన రైతులలో 70 శాతం పైగా కౌలు రైతులు ఉన్నారని, ముందస్తు కౌలు చెల్లించి రకరకాల పంటలు సాగు చేశారని చెప్పారు. కౌలు రైతులకు నామమాత్రపు పరిహారం కాకుండా క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి పూర్తి నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేరళ తరహా రుణ విమోచన చట్టాన్ని అమలు చేసి ఆదుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలను సమావేశం ఆమోదించింది. ఈ-క్రాప్‌లో నమోదు చేయని పంటలకూ పరిహారం చెల్లించాలని, పరిహారం నేరుగా కౌలు రైతులకే ఇవ్వాలని, పంట నష్టపరిహారాన్ని పెరిగిన ఇన్ పుట్స్ ధరలకు అనుగుణంగా పెంచాలని, అన్ని పంటలకు దిగుబడుల ఆధారిత పంటల బీమాను అమలు చేయాలని, ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆర్.బి.కెల ద్వారా ఉచితంగా ఇవ్వాలని, పత్తి, ధాన్యం పంటలను నిబంధనలను సడలించి కనీస మద్దతు ధరలకు ప్రభుత్వం కొనుగోలు డిమాండ్లతో తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో హనుమంతరావు, పిచ్చారావు, లక్ష్మీనారాయణ, తాతారావు, మేరమ్మ, ఆంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వై రాధాకృష్ణ

కాంగ్రెస్ జెండా దిమ్మెను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

రూరల్ సిఐ సమీముల్లాకు ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి వినతి

ప్రజాశక్తి - మాచర్ల : రూరల్ పరిధిలోని విజయపురిసౌత్ అంబేద్కర్ సెంటర్‌లోని కాంగ్రెస్ పార్టీ జెండా దిమ్మెను కొందరు ధ్వంసం చేసినట్లు రూరల్ సిఐ సమీముల్లాకు సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టరు యరమల రామచంద్రారెడ్డి ఫిర్యాదు చేశారు. వారం రోజుల క్రితం ధ్వంసం చేస్తుంటే అడ్డుకున్న తమ కార్యకర్తలపై భౌతికదాడులు చేస్తామని దుండగులు బెదిరించినట్లు తెలిపారు. ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోని జెండా దిమ్మె నిర్మాణంలో తమకు సహకారం అందించాలని సిఐకి ఫిర్యాదు చేసినట్లు డాక్టరు రామచంద్రారెడ్డి వివరిం చారు.

నగరవనం పనులు పరిశీలించిన సబ్ డిఎఫ్ఓ

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల-శ్రీశైలం రహదారి మండాది పట్టణ శివారు ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న నగరవనం పనులను అటవీశాఖ మాచర్ల సబ్ డిఎఫ్ఓ విజయ సోమవారం పరిశీలించారు. పట్టణ శివారు ప్రాంతం మండాది బోడును అనుకోని ఉన్న మైదాన ప్రదేశంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నగరవనం ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభం అయినాయి. అక్కడ పాదచారులకు వాకింగ్ ట్రాక్ మరియు పలు వృక్షాలతో ఒక వనం ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ 2 కోట్లు కేటయించగా, సదరు నిధులతో పనులు జరుగుతు న్నాయి.

వికలాంగురాలికి ఇంటి స్థలం మంజూరు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : అనాథ దివ్యాంగురాలికి జిల్లా కలెక్టర్ అండగా నిలిచారు. నాదెండ్ల మండలం, తూబాడు గ్రామానికి చెందిన వి.జ్యోతి అనే దివ్యాంగురాలుకి ఇంటి స్థలం అందించి జిల్లా కలెక్టర్ మానవ త్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని తోడు నీడ వద్ధాశ్రమంలో ఉంటూ బి ఏ వరకు చదువుకున్నారు. దివ్యాంగురాలు జ్యోతి గత నెలలో "జగనన్నకు చెబుదాం"(స్పందన) తనకు సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు చేసుకోగా ఇంటి స్థలం మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని ఎస్.ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బాధితురాలకి నివేశన స్థల పట్టాను అందజేశారు.

సచివాలయ సిబ్బందిపై వైసిపి నాయకుని దాడి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : సచివాలయ సిబ్బందిపై వైసిపి కౌన్సిలర్ భర్త దాడి చేసిన ఘటన పట్టణంలోని 29వ వార్డు నందు గల 6వ సచివాలయం వద్ద సోమవారం చోటుచేసుకుంది. బాధితుని వివరాల ప్రకారం.. వార్డు సచివాలయంలో ఎమినిటీ సెక్రటరీగా ఫణీంద్ర సచివాలయంలో సంక్షేమ ఫలాల బోర్డు ఏర్పాటు చేస్తున్న క్రమంలో కౌన్సిలర్ భర్త వైసిపి జండా కూడా పెట్టాలని సూచించారు. ఇందుకు సచివాలయ సిబ్బంది అభ్యంతరం తెలపడంతో సెక్రటరీ ఫణీంద్రను కౌన్సిలర్ భర్త దుర్భషలాడారు. ఈ క్రమంలో తోపులాట తలెత్తగా ఈ ఘటనను శానిటేషన్ సెక్రటరీ అశోక్ కుమార్ వీడియో తీస్తున్నారు. దీంతో అశోక్ వద్ద ఫోన్‌ను కౌన్సిలర్ భర్త ఆయన షేక్ సైదావలి లాక్కుని అతని తలపై బలంగా కొట్టడంతో అశోక్‌కు తల పగిలింది. దీనిపై సచివాలయ సిబ్బంది అంతా స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి నిరసన తెలిపి ఫిర్యాదు చేశారు. గతంలో కూడా పిడుగురాళ్ల పట్టణంలోని సచివాలయ సిబ్బందిపై పలుమార్లు స్థానిక నాయకులు దాడులు చేసినా తమకు న్యాయం జరగలేదని సచివాలయ సిబ్బంది రాష్ట్ర నాయకులు అబ్దుల్ రజాక్ తెలిపారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఆందోళన చేస్తామన్నారు.

నిధుల విడుదలపై గరం..గరం

(మొదటిపేజీ తరువాయి)

నిలిచిపోయాయని మేయర్ కావటి మనోహర్ నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.50 దాటితే సిఎఫ్ఎంస్ ద్వారా ప్రభుత్వానికి పంపాలని, రూ.50 లక్షల లోపుఅయితే నేరుగా చెక్కులు ఇచ్చేలా నిర్ణయం తీసుకుంటే అలాగే చేద్దామని కమిషనర్ బదులిచ్చారు. రూ.50 లక్షలకుపైబడిన కాంట్రాక్టు పనులు ఆగిపోతే తనను ప్రశ్నించవద్దన్నారు. ఇప్పటి వరకు సిఎఫ్ఎంఎస్ ద్వారా కూడా బిల్లులు క్లియర్ అవుతున్నాయని తెలిపారు. సీరియల్ నెంబరులో ఫస్టు కం ఫస్టు అవుట్ గా బిల్లులు చెల్లిస్తే బాగుంటుందని మేయర్ అభిప్రాయపడ్డారు. బిల్లులు రాకపోవడం వల్లతమ వార్డుల్లో పనులు జరగడం లేదని పలువురు కార్పొరేటర్లు చెప్పారు. రూ.50 లక్షలు దాటిన బిల్లులు సిఎఫ్ఎంఎస్‌కు పంపిస్తామంటే పెద్ద పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రారని కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి,రోషన్, ఈచంపాటి ఆచారి అన్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల నగరంలోపనులన్నీ నిలిచిపోయాయని ఎమ్మెల్యే మద్దాలి గిరి అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని పలువురు కార్పొరేటర్లు కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికులసంఖ్యను పెంచడంలేదన్నారు. ఫాగింగ్ నిర్వహణ సరిగాలేదని కార్పొరేటర్లు మండిపడ్డారు. కార్పొరేటర్లు షేక్ ఖాజా మొహిద్దీన్, పోలవరపు జ్యోతి, వెంకటరెడ్డి,రంగారెడ్డి తదితరులు ప్రశ్నించారు. ఈ ఆటోలు రావడంలేదని, పుష్‌కాట్‌ల ద్వారా చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రోబోలు ఉన్నా తమ వార్డుకు పంపడంలేదని కార్పొరేషన్ చిష్టి ఆరోపించారు. అలాగే నగరంలో హోర్డింగ్‌లపై సమావేశంలో తీవ్ర గందరగోళం చెలరేగింది. హోర్డింగ్‌ల నిర్వహణలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కార్పొరేటర్లు ఆరోపించారు. అనధికారిక హోర్డింగ్‌లు తొలగిస్తున్నా మళ్లీ వెంటనే వెలుస్తున్నాయని కార్పొరేటర్ రోషన్, వెంకటరెడ్డి, ఈచంపాటి ఆచారి ధ్వజమెత్తారు. ప్రజలపై పడి ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. హోర్డింగ్‌ల నుంచి రావాల్సిన ఫీజులను సక్రమంగా వసూలు చేయకుండా వారు కోర్టులకు వెళ్తున్నా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పట్టించుకోకుండా వారితో కుమ్మక్కు అవుతున్నారని కార్పొరేటర్లు ఆరోపించారు. భారీ హోర్డింగ్‌లకు ఆర్ట్స్ అండ్ ఆర్ట్స్ వారు రూ.1.20 లక్షలు వసూలు చేస్తున్నారని కానీ కార్పొరేషన్‌కు మాత్రం ఫీజు కట్టడం లేదన్నారు. ఒకరి పేరున టెండరు పొంది మరొకరు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు కమిషనర్ చేకూరి కీర్తిమాట్లాడుతూ అనధికారిక హోర్డింగ్‌లను తొలగిస్తామని తెలిపారు. వీటి నిర్వాహకులపై చర్యలు ఉంటాయన్నారు.

బస్‌బేలకు అనుమతి ఇవ్వడంపై టిడిపి, వైసిపి కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేసినా వాటిని ఆమోదించారు. బస్‌బేల వల్ల విలువైన కార్పొరేషన్ స్థలాలు ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారని అన్నారు. కార్పొరేటర్లంటే గౌరవం లేదని మల్లవరపు రమ్య విమర్శించారు. రెడ్డిపాలెం వద్ద ఆధిత్యనగర్‌లో డ్రెయిన్ల నిర్మాణం జాప్యం పై ఆమె ధ్వజమెత్తారు. గుంటూరులో టెండర్లు పొందిన కార్పొరేటర్లు పనులు ఎందుకు చేయడంలేదని ప్రతిపక్ష నాయకుడు కోవెలమూడి రవీంద్ర ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లయినా టిడ్కో ఇళ్లు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని అడిగారు. ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన ఈ-ఆటోలు లేవని, చెత్త తొలగింపులో ఎన్నో లోపాలు ఏర్పడుతున్నాయని ధ్వజమెత్తారు. డొంకరోడ్డు నుంచి శారదాకాలనీకి కిలో మీటరు రోడ్డుకు రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారని కార్పొరేటర్లు అంబేద్కర్ విమర్శించారు. ఇంకా పలు వార్డుల్లో పనులు జరగడంలేదని, చేపట్టిన పనులు పూర్తిచేయడంలో జాప్యం జరుగుతుందని కార్పొరేటర్లు విమర్శించారు. సంకురుశ్రీనివాసరావు, తేలుకుట్ల హనుమాయమ్మ, యట్ల రవికుమార్ మాట్లాడారు. డిప్యూటీమేయర్ డైమండ్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైసిపి ఎమ్మెల్యేలకు జంబ్లింగ్!

(మొదటిపేజీ తరువాయి)

తెలియడంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేసి కలకలం సృష్టించారు. అంతేగాక ఆళ్ల వైసిపికి కూడా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో నియోజకవర్గంలో ఆయన అనుచరులు కూడా రాజీనామా బాటపట్టారు. మంత్రి విడదల రజనీని చిలకలూరిపేట నుంచి గుంటూరు పశ్చిమ బాధ్యతలు అప్పగించారు. ఈ విషయం ముందే తెలుసుకున్న ఆమె కొంత కాలంగా చిలకలూరిపేటకు దూరంగా ఉంటున్నారు. చిలకలూరిపేటలో ఇటీవల తుపాను సమయంలోనూ ఆమె రైతులను పరామర్శించలేదనే విమర్శలు వచ్చాయి. చిలకలూరిపేట సీటు తనకు రాదని తెలిసి ఆమె గుంటూరులో స్థిరనివాసం కోసం ఇంటి నిర్మాణం కూడా చేపట్టారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరి పరిస్థితి డోలాయనంలో పడింది. ఆయనకు ఎక్కడ అవకాశం కల్పిస్తారన్నదీ సందిగ్ధంగామారింది. చిలకలూరిపేటలో వ్యాపార వేత్త మల్లెల రాజేష్ నాయుడు ఎంపిక చేయడం ద్వారా సామాజిక సమీకరణపై దృష్టి పెట్టారు.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు ఆ నియోజకవర్గంలో ఉన్న ప్రతికూల పరిస్థితుల్లో ఆమెకు తాడికొండ బాధ్యతలు అప్పగించారు. తాడికొండలో మూడు రాజధానుల ప్రతిపాదనపై నాలుగేళ్లుగా ఉద్యమం జరుగుతుండటం, రాజధాని మార్పు ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల ఆమె ఎంత వరకు సఫలీకృతులవుతారన్నదీ ప్రశ్నార్థకంగా మారింది. తాడికొండలో సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీదేవి వైసిపిలో కొనసాగుతున్న సమయంలోనే మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్‌ను అదనపు సమన్వయకర్తగా నియమించారు. అప్పట్లో ఆయన నియామకంపై శ్రీదేవి నిరసన వ్యక్తం చేశారు. రెండు నెలలకే డొక్కాను తొలగించి కత్తెర సురేష్‌కు అవకాశం కల్పించారు. గత మార్చిలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలపై ఉండవల్లి శ్రీదేవిని వైసిపి నుంచి సస్పెండ్ చేశారు. ఆ తరువాత ఆమె టిడిపిలో చేరారు. అప్పటి నుంచి కత్తెర సురేష్ నియోజకవర్గంలో చురుగ్గా పర్యటిస్తున్నా ప్రజలలో సానుకూలత రాలేదని సర్వేల్లో తేలడంతో మూడోసారి ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరితను ఎంపిక చేశారు. ప్రత్తిపాడులో సుచరిత స్థానంలో ఇన్‌చార్జిగా ఆర్కిటెక్చర్, ఎన్ఆర్ఐ బాలసాని కిరణ్‌కుమార్‌ను నియమించారు. ఆయనకు స్థానికంగా పార్టీతో ఎటువంటి సంబంధాలూ లేవు. కొత్త అభ్యర్థిని రంగ ప్రవేశం చేయిస్తున్నారు. వేమూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మేరుగ నాగార్జునను ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమించారు. వేమూరులో నాగార్జునకు ప్రతికూలత పెరిగింది. నాగార్జున స్థానంలో ప్రకాశం జిల్లా కొండపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబుకు వేమూరు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. రేపల్లెకు మాజీమంత్రి ఈపూరు సీతారామమ్మ కుమారుడు డాక్టర్ ఈపూరు గణేష్‌కు బాధ్యతలు ఇచ్చారు. ఇక్కడ ఎంపి మోపిదేవి వెంకట రమణకు బాధ్యతల నుంచి తప్పించారు. మొత్తంగా ఎన్నికలకు మూడు నెలల ముందే అభ్యర్థుల ఎంపికలో వైసిపి వేగంగా అడుగులు వేస్తోంది.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా చిలకలూరపేట మండలం గంగన్నపాలెం నుండి నరసరావుపేట కు లారీలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తుండగా విజిలెన్సు అధికారులు దాడి చేసి 133 బస్తాల బియ్యం పట్టుకున్నారు. పౌరసరఫరాల శాఖ ముద్రణతో కూడిన గోతాలతో బియ్యం రవాణా అవుతున్నట్టు గుర్తించినట్టు అధికారులు తెలిపారు. వీటి విలుల రూ.2.32 లక్షలుగా వివరించారు. లారీ యజమాని, బియ్యం పంపిణీ చేసి మిల్లుపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. పై తనిఖీలలో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి,స్థానిక చిలకలూరపేట పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసిల్దార్ కొండా రెడ్డి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత సిగరెట్లు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : నిషేధించిన సిగరెట్లు అమ్ముతుండగా దాడి చేసి 2050 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్టు విజిలెన్సు అధికారులు తెలిపారు. తెనాలి నాజర్ పేట సంకా వారి షాపుల బజార్ లోని చౌతా రాజకుమార్ 'పారిస్ బ్రాండ్' సిగరెట్స్ అక్రమంగా, ఏ విధమైన బిల్లులు లేకుండ అమ్ముతున్నాడని అధికారులు చెప్పారు. గుంటూరులో సూరా వెంకట్ అను వ్యక్తి నుండి బిల్లులు లేకుండా సిగరెట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ.లక్ష రెండు వేలుగా తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో సిఐ శ్రీహరిరావు పాల్గొన్నారు.

18వ తేదీకి పంటనష్టం అంచనాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టం జరిగిన పంటల ఎన్యూమరేషన్ గ్రామ, మండల, సబ్ డివిజన్ స్థాయి కమిటీలు సక్రమంగా నమోదు చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది జిల్లా సంయుక్త కలెక్టర్లకు సూచించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి గోపాలకృష్ణ ద్వివేది పంటల ఎన్యూమరేషన్‌పై జిల్లా సంయుక్త కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన పంటల ఎన్యూమరేషన్ డిసెంబరు 18 నాటికి పూర్తి చేసి వివరాలను సోషల్ అడిట్ కోసం ఆర్బీకేలలో ప్రదర్శించి, డిసెంబరు 22 వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిష్కరించి తుది జాబితాను డిసెంబరు 26 నాటికి రాష్ట్ర కార్యాలయాలకు అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి రాజకుమారి, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలి

జిల్లాలో అర్హులైన ప్రతి జర్నలిస్టూ ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నవంబర్ 23 నుండి ప్రారంభం అయిందన్నారు. సోమవారం సిఎం క్యాంప్ కార్యాలయం నుండి పౌర సంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫిషియో సెక్రటరీ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి ఇళ్ల స్థలాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుంటూరు కలక్టరేట్ నుండి జిల్లా జేసీ రాజకుమారి పాల్గొన్నారు. అనంతరం రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో 480 మంది పాత్రికేయులకు అక్రిడిటేషన్లు మంజూరు అయ్యాయని, అయితే పాత్రికేయులు ఇళ్ల స్థలాలకు ఇప్పటి వరకు వంద మంది మాత్రమే ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అర్హులైన జర్నలిస్టులు తమ వివరాలను http://ipr.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. చివరి తేది జనవరి 6 వరకూ వేచి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందన్నారు. ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు వారి దరఖాస్తులను జిల్లా పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో అందచేయాలన్నారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

ఆడుదాం ఆంధ్రా పోటీలకు పటిష్ట ప్రణాళిక

జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడపోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు పటిష్ట ప్రకాళిక ప్రకారం తీసుకుంటున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు ఆడుదాం ఆంధ్రా జిల్లా నోడల్ అధికారి జి.రాజకుమారి తెలిపారు. రాష్ట్ర యువజన సర్వీసులు, టూరిజం మరియు సంస్కతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న సోమవారం రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్ నుండి పాల్గొన్న జెసి మాట్లాడుతూ డిసెంబరు 15 నుంచి పోటీలు ప్రారంభించేందుకు, జిల్లాకు వచ్చిన క్రీడాపరికరాలను సచివాలయం, మండలం, నియోజకవర్గాలకు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. క్రీడలకు అవసరమైన క్రీడ మైదనాలను గుర్తించామని, క్రీడకారుల రిజిస్ట్రేషను, టీం ఫార్మేషన్ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

రూ.20 వేలు పోయాయి... ప్రాణాలు దక్కాయి

ప్రజాశక్తి-తాడేపల్లి : రైలు గేటు వేసిన సమయంలో రైలు పట్టాలు దాటడం ఎంత ప్రమాదకరమో సోమవారం తాడేపల్లి ప్యారీ కంపెనీ గేటు సమీపంలో జరిగిన సంఘటన కళ్లకు గట్టినట్లు చూపింది. ఉదయం సుమారు 12 గంటల సమయంలో గేటు వేసి ఉన్నా ట్రైను వస్తుందనే భయంతో పట్టాలు దాటడానికి ఓ మహిళ ప్రయత్నించింది. కంగారులో ఆమె కిందపడి పోయింది. ఆమె ముందుకు పడటంతో ప్రాణాలు దక్కించుకుంది. అదే వెనక్కి పడి ఉంటే ఘోరం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో స్థానిక బ్యాంకులో డ్వాక్రా డబ్బులు జమ చేద్దామని రూ.80 వేలు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను రైలు లాక్కెల్లిపోయింది. బ్యాగు నుజ్జునుజ్జు కావడంతో రూ.80 వేలు రైలు పట్టాల కింద కొన్ని గాలికి కొన్ని ఎగిరిపోయాయి. అనంతరం చుట్టుపక్కల స్థానికుల సహాయంతో వెతకగా రూ.60 వేలు దొరికాయి. గ్రూపు డబ్బులు కట్టడానికి అందరి దగ్గర వసూలు చేసుకొచ్చిన రూ.20 వేలు పోవడం పట్ల ఆమె బోరున విలపించింది. డబ్బులు పోయినా ప్రాణాలు దక్కాయని మరికొందరు ఆమెకు ధైర్యం చెప్పి పంపించారు.

జిల్లాలో 243 మంది లా నేస్తం

ప్రజాశక్తి-గుంటూరు

కొత్తగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన జూనియర్ న్యాయవాదులు వత్తిలో స్థిరపడడానికి, ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రాక్టీస్ చేయడానికి సబ్జెక్ట్‌పై పట్టు సాధించడానికి పుస్తకాలు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం లా నేస్తం ద్వారా స్టైఫండ్ అందిస్తూ అండగా ఉంటుందని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 2023-24 సంవత్సరానికి లానేస్తం రెండో విడత నిధులు జమ చేసే కార్యక్రమంలో వర్చువల్‌గా గుంటూరు కలెక్టరేట్ నుండి రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, జేసీ రాజకుమారి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ చైర్ పర్సన్ మందపాటి శేషగిరిరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సహాయక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్‌పఠాన్ పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా జేసీ రాజకుమారి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో న్యాయ శాస్త్రంలో పట్టా పొంది న్యాయవాదులుగా బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొన్న 243 మంది జూనియర్ న్యాయవాదులుకు లా నేస్తం ద్వారా నెలకు రూ.5వేలు చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ జె. మోహన్‌రావు, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధన రావు, యువ న్యాయ వాదులు పాల్గొన్నారు.

లబ్దిదారులతో జేసి ప్రజాప్రతినిధులు

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి- పెదనందిపాడు : మండలంలోని పెదనందిపాడు గ్రామంలో ఎన్టీఆర్ కాలనీలో వడ్డే ప్రసాదుకు చెందిన ఇల్లు సోమవారం అగ్ని ప్రమాదానికి గురిఅయ్యింది. బాధితులకు ఎమ్మార్వో ఆఫీస్ నుండి ఆర్ ఐ నాగమల్లేశ్వరరావు బియ్యం, నిత్యవసర వస్తువులు అందజేశారు. వైసీపీ మండల కన్వీనర్ షేక్ ఖాసింపిరా బాధితులకు రూ.పదివేలు ఆర్థిక సహాయం అందజేసి, ఇంటికి మరమ్మతు పనులు కూడా చేయిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : ఆర్టీసీ బస్సును కారు ఢీకొట్టిన సంఘటనలో కారు డ్రైవర్ గాయపడ్డాడు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల సమీపంలో సోమవారం జరిగింది. గుంటూరు నుండి పిడుగురాళ్ల వెళుతున్న ఆర్టీసీ హాయ్యర్ బస్సును పిడుగురాళ్ల నుండి సత్తెనపల్లి వైపు వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టింది. ఇది గమనించిన ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా బస్సు సడన్ బ్రేక్ వేయటంతో బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొని ఆగింది. బస్సులో ఉన్న 18 మంది ప్రయాణికుల సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో గుంటూరు గోరంట్లకు చెందిన తాటి శివబాబు తీవ్రంగా గాయపడ్డాడు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమయపాలనపై 'చలపతి'లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని బేసిక్ సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలోగల సాహస్ విద్యార్థి విభాగం, విశ్వసంపద వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సమయ నిర్వహణ, లక్ష్య చేధన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వై.ఆరుద్ర సమయపాలన, లక్ష్యఛేదన అనే అంశాన్ని వివరిస్తూ, ప్రస్తుత సమాజంలో నెలకొన్న పోటీ రీత్యా ఉద్యోగావకాశాలు పొందటానికి కావాల్సిన సలహాలు, సమయ నిర్వహణ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. విద్యార్థుల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడు తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్, చైర్మన్ వై.వి.ఆంజనేయులు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ ప్రసంగించారు.

జీవన నైపుణ్యాలపై మలినేనిలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల పెంపుదలకు మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజిలో 15రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఆటమ్స్ ఎడ్యుకేషన్ ప్రైవేటు లిమిటెడ్‌తో కలిసి నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌లో ఆటమ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అయ్యప్ప శిగినం ప్రసంగించారు. ఈ సందర్భంగా మలినేని విద్యాసంస్థల చైర్మన్ పెరుమాళ్ల మాట్లాడుతూ నేటి యువతకు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఎంతో అవసరం అన్నారు. విలువలతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాప్ ఏర్పాటు చేశామని, విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిందూ ఫార్మసీలో తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం డి.ఫార్మసి, బి.ఫార్మసి, ఫార్మా.డి, ఎం.ఫార్మసి తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు అభినందనలు తెలిపారు. కళాశాలలో మౌలిక వసతులు, కోర్సుల గురించి వివరించారు.ముఖ్య అతిథిగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రావణ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుండే తమ గమ్యాన్ని నిర్ధారించుకొని దానిని సాధించటానికి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని అన్నారు. ఉన్నత ఫార్మసీ విద్యను అభ్యసించి పరిశోధనలు చేసి నూతన ఔషధాలను కనిపెట్టాలని అన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధు సూదనరావు మాట్లాడుతూ ఫార్మసీలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలియచేస్తూ తాము అమలు చేస్తున్న మార్గ దర్శకత్వం గురించి వివరించారు.కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ నూతన ఔషధాల తయారీకి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత పదవులను అధిరోహించాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.పూర్ణిమ నూతన విద్యార్థులతో ఫార్మసిస్ట్ ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ముఖ్య అతిధిని యాజమాన్యం శాలువా, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వినాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. రవికుమార్, దీక్షారంభ్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు, ఫార్మ.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE:TENALI
I.A 638/23 in I.A 445/23 in I.A 140/23 in O.S 314/15

Between
1.Karlapudi Uday Kiran Rani
2.Karlapudi Bhanu Sandhya Rani
...Petitioner/Plaintiff
And
1.Karlapudi Vinaya Babu
2.Karlapudi Jhansi Swarupa Rani
3.Karlapudi Mary Padma Rani
4.Nathala Bharathi
5.Kocherla Ranjit
6.Nadendla Samsonu
7.Shaik Karimulla
8.Karlapudi Sudha Rani
9.Karlapudi Apurupa
10.Karlapudi Pavan Kurthi
11.Nadendla Swarupa Rani
12.Nadendla Pradarthi
13.Nadendla Narendra
...Respondent/Defendant

పైన ఉన్న Final decree Petition లో Respondent/Defendant "7" Shaik Karimulla S/o Shaik Run Hussain, Age 42 Years, D.No.5-12-2, Doppalapudi Post, Ponnuru Mandal, Guntur(D.t).

Respondent/Defendant Number 7 Shaik Karimulla Final decree I.A 638/23 in I.A 445/23 in I.A 140/23 in O.S 314/15 లో Notice తీసుకోని కారణం చేత Paper Notice Addl Senior Civil Judge Tenali వారి పర్మిషన్ తో notice ఇస్తున్నాము. Next hearing 22-01-2024 మీరు Addl Senior Civl Judge Court కి రావలసిందిగా కోరుచున్నారు లేని పక్షములో Court వారు Exparty చేయగలరని తెలియచేయు చున్నాము.

ఇట్లు
A.R.Srinivasa Murthy,
Advocate,
Guntur,
K.Bhanu Sandhya Rani,
Advocate.

మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఓ.యస్.నెం.115/17 ఇన్ ఐ.ఏ.402/23

బిట్వీన్:
కలవకొల్లు హరినాథరావు మరియు మరొకరు ...వాది
మరియు
యలగల చెన్నయ్య అండ్ ఇతరులు ...ప్రతివాదులు
బోడపాటి సావిత్రి భర్త రాధాకృష్ణ,
వయస్సు 55 సం॥లు, నివాసము
డోరు నెం.21-2-9/జి, బోసు రోడ్డు, సాయిబాబా గుడి వద్ద, రామలింగేశ్వరరావుపేట, తెనాలి టౌన్, గుంటూరు జిల్లా.

పై దావాలో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినప్పటికిన్నీ, మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందు వలన మీకు నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తము ఈ దావాను తేది 18-01-2024నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదీన ఉదయం గం.10-30 గం॥లకు పై కోర్టువారి ఎదుట స్వయముగా గానీ, వకీలు ద్వారా గాని హాజరై పై దావాలో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని యెడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

//శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో//
వాయిదా:18-01-2024

ఎల్.శ్రీహర్ష,
బి.ఎల్.కోటేశ్వరరావు,
వాది తరపు న్యాయవాదులు,
సత్తెనపల్లి, పల్నాడు జిల్లా,
సెల్.నెం.9290037775.

ప్రకటన

మా క్లయింట్ పల్నాడు జిల్లా, పిడుగురాళ్ళ పట్టణ కాపురస్తుడు నర్రెడ్డి కృష్ణా రెడ్డి గారి కుమారుడు పురుషోత్తమ రెడ్డి నుండి సరియైన సమాచారం పొంది యావన్మందికి ఈ క్రింది విధముగా తెలియజేయుటమైనది.

మా క్లయింట్ మరియు గుంటూరు కాపురస్తుడు కొండబత్తిని అంకమ్మ రావులు, ది.30-12-2020న M/s SAI VIP EXCLUSIVE SHOW ROOM అనే పేరుతో భాగస్వామ్య వ్యాపారం ప్రారంభిద్దము అనే ఉద్దేశ్యంతో సదరు ఫరంను గుంటూరు రిజిష్టర్ ఆఫ్ ఫరమ్స్ లో కూడా 14/2021 గా ది.09-01-2021 న నమోదు చేసుకొని వున్నారు. దరిమిలా తప్పనిసరి పరిస్థితులలో పై తెలిపిన భాగస్వామ్య వ్యాపార సంస్థ తరపున వారిరువురు ఎట్టి వ్యాపార కార్యకలపాలు నిర్వహించలేదు. అందువలన సదరు భాగస్వామ్య వ్యాపార సంస్థను రద్దు చేసుకొని వున్నారు. ప్రస్తుతం M/s SAI VIP EXCLUSIVE SHOW ROOM, Regd.No.14/2021 ఉనికిలో లేదని, రద్దు అయిపోయినది అని సదరు సంస్థతో ఎవరు ఎట్టి కార్యకలపాలు నిర్వహించరాదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

పిడుగురాళ్ళ
ది.10-12-2023

ఆర్.సాంబశివరావు,
అడ్వకేట్,
సెల్ నెం.94404 38199.

ప్రకటన

విజయవాడ ఎ.సి.బి.కోర్టు పరిధిని పెంచు నిమిత్తం సమర్పితం జస్టిస్ నిమిత్తం ప్రధాని కార్యాలయం నుండి రాబడిన అంశాలకు/స్థలానికి అనుగుణంగా అవినీతి, దారుణమైన అరాచకాలు, అక్రమాలపై వాస్తవికత, సత్వర న్యాయ నిమిత్తం విచారణా ఖర్చులు చెల్లించుటకు సిద్ధపడి తరిగొండలోని సత్యపీఠికపై విచారణార్థం విజయవాడ ఎ.సి.బి.కోర్టు పరిధిని పెంచవలసినదిగా అభ్యర్థిస్తూ ఎ.పి.హైకోర్టు యంత్రాంగాన్ని కోరటమైనది/అభ్యర్థించడమైనది.

P.Venkateswara Rao,
Guntur, 9849933404.

పేరు మార్పు

నేను షేక్ హష్మ, W/o.షేక్ ఫజాల్, నివాసం: డోర్ నెం.81-11-991, ఇందిరాగాంధి నగర్, 10/2 లైన్, జండాచెట్టు దగ్గర, నల్లచెరువు, గుంటూరు జిల్లా.

నా యొక్క ప్రస్తుత పేరు ఆధార్ ప్రకారంగా షేక్ హష్మ, నుండి షేక్ అస్మతున్నిసా, W/o.షేక్ ఫజాల్, SHAIK ASMATUNNISA W/o. SHAIK FAZAL, 10వ తరగతి, పాన్, ఓటర్‌కార్డు ప్రకారంగా మార్పు చేసుకుంటున్నాను. నేటి నుండి నా పేరును షేక్ అస్మతున్నిసా W/o. షేక్ ఫజాల్ గా పిలువబడును.

CHANGE OF NAME

I, **TALAPAREDDY NAGA PRASADE REDDY** (Old Name), S/o Talapareddy Koteswara Reddy, Resident of D.No. 11-8-5, Ramireddypet, Narasaraopet Town, Palnadu Dist. -522601, Andhra Padesh. My name has been changed to **TALAPAREDDY NAGA PRASAD REDDY** (New Name). Hereafter my name known as **TALAPAREDDY NAGA PRASAD REDDY**

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

తుపాను కారణంగా మండలంలోని మాదలలో దెబ్బతిన్న మిర్చి పొలాలను సిపిఎం నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాగర్ కాల్వ నుండి నీరు రాకున్నా బోర్లు, బావుల కింద సాగు చేశారని, ఎన్నో కష్టనష్టాలకోర్చి, అధికంగా పెట్టుబడులు పెట్టారని చెప్పారు. తుపాను నేపథ్యంలో మిర్చి, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పరిశీలనలో నాయకులు కె.సాంబశివరావు, కె.జాలయ్య, పి.సైదాఖాన్, ఎం.వెంకటరెడ్డి, సిహెచ్.నాగమల్లేశ్వరరావు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సమగ్ర శిక్ష ప్రాజెక్టులో భాగంగా సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాదిపదికన పనిచేస్తున్న సిఆర్‌పిలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాథ్ ఠాగూర్ విష్ణుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో జారీ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులకు నాలుగు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో వారి పరిస్థితి దుర్భరంగా మారిందని, ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులు, పిల్లల స్కూలు ఫీజులు, కుటుంబ ఖర్చుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఒక సిఆర్‌పి కుమారుడు అనారోగ్యం పాలైతే ఆస్పత్రికి తీసుకువెళ్లగా బిల్లు కట్టడానికి డబ్బుల్లేక వారు పడిన కష్టాలు అంతాయింత కాదని ఆవేదన వెలిబుచ్చారు. మిగతా కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదని, కార్యాలయంలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులందరూ మహిళలే కావడంతో తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక మనోవ్యథకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మానవతా దక్పథంతో ఆలోచించి వారికి తక్షణమే వారికి పెండింగ్ జీతాలను చెల్లించాలని కోరారు.

రవికుమార్‌కు మరో పురస్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణానికి చెందిన రంగస్థలం నటులు బెజగం రవికుమార్‌కు తెలుగు వెలుగు సాహితీ వేదిక గ్రేటర్ వరంగల్ వారి 'తెలుగు వెలుగు పౌరాణిక కళారంజక పురస్కారం' లభించింది. ఈ మేరకు విజయవాడలో రాఘవయ్య పార్క్ వద్ద గల బలోత్సవ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాల స్థాయిలో విద్య, వైద్యం, సాహిత్యం, భరత నాట్యం, గాయకులు, కళలు, అర్చక తదితర రంగాల్లో ప్రావీణ్యం చూపిన 200 మందికి పురస్కారాలు ప్రదానం చేయగా వారిలో రవికుమార్ ఉన్నారు. రవికుమార్‌కు పట్టణంలోని వివిధ కళా సంస్థల అధ్యక్షులు కార్యదర్శులు, మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

బతుకు బండ్ల తొలగింపు

ప్రజాశక్తి - దాచేపల్లి

తోపుడు బండ్లపై ఏళ్ల తరబడి చిరువ్యాపారం చేసుకుంటున్న వారిపట్ల పోలీసులు, మున్సిపల్ అధికారులు అనుచితంగా ప్రవర్తించారు. సోమవారం తెల్లవారుజామున తోపుడు బండ్లను తొలగించారు. దీనిపై చిరువ్యాపారులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. దీనిపై సిఐటియు ఆధ్వర్యంలో వివిధ పార్టీల మద్దతుతో సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక కొట్ల బజారుకు వెళ్లే మార్గంలో రోడ్డుకిరువైపులా పూలు, పళ్లను విక్రయాలు కొన్ని దశబ్దాలుగా సాగుతున్నాయి. అయితే ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉందనే పేరుతో చిరు వ్యాపారులను ఖాళీ చేయాలని అధికారులు గతంలో చెప్పారు. అయితే తమ జీవనాధారంపై దెబ్బకొట్టొద్దని, తమను విక్రయాలను కొనసాగించనివ్వాలని చిరువ్యాపారులు కొరుతూ వస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున మున్సిపల్ కమిషనర్, పోలీసుల ఆధ్వర్యంలో చిరువ్యాపారుల బడ్లను తొలగించారు. దీంతో వందలాంది మంది చిరువ్యాపారులు నిరసన ప్రదర్శన చేపట్టారు. తమ బతుకులను రోడ్డున పడేయొద్దని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బడ్ల తొలగింపు దారుణమన్నారు. నాగులేరు పక్కకు వెళ్లాలని అధికారులు చెబుతున్నారని, మురుగునీరు ప్రవిహించే చోట, బహిర్భూమిగా వాడుతున్న స్థలంలో పండ్ల విక్రయాలు ఎలా చేస్తారని, ఈ విషయం అధికారులకు తెలియదా? అని ప్రశ్నించారు. బండ్ల తొలగింపును అడ్డుకోబోయిన వారిపై దౌర్జన్యం హేయమన్నారు. జరిగిన నష్టంపై చిరు వ్యాపారులకు పరిహారం చెల్లించాలని కౌన్సిల్‌ను అత్యవసరంగా సమావేశపర్చి న్యాయం చేయాలని కోరారు. నిరసన ప్రదర్శనకు సిఐటియు, టిడిపి, జనసేన నాయకులు మద్దతు తెలిపి పాల్గొన్నారు.

బళ్ల తొలగింపును నిరసిస్తూ ప్రదర్శన చేస్తున్న చిరు వ్యాపారులు, నాయకులు

అన్నం పెట్టకుండా గెంటేశారు...

ఉల్లిపాయల వ్యాపారికి వ్యాపార నిమిత్తం రూ.10 లక్షలివ్వగా వాటిని తిరిగివ్వకుండా బెదిరిస్తున్నాడని నరసరావుపేటకు చెందిన కొల్లి భూపతిరావు ఫిర్యాదు చేశారు. తన ఇంట్లో వాడుకున్న నీటిని, బయటకి పోనివ్వకుండా పక్కింటి వాళ్లు గొడవలు పెట్టుకుని కర్రలతో కొట్టారని పెదకూరపాడుకు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. తమకు అన్నం పెట్టకుండా ఇంట్లో నుండి కొడుకు, కోడలు గెంటేశారని మాచవరం మండలం మొర్జంపాడుకు చెందిన కుంభా కోటేశ్వరరావు దంపతులు ఫిర్యాదు చేశారు.

ఆరోగ్యం బాగాలేదు సాయం చేయండి..

2008 నుండి పొన్నూరులో హోం గార్డుగా పని చేసిన కుమారుని ఆరోగ్యం దెబ్బతిని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సహాయం చేయాలని బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం కూరేటివారిపాలేనికి చెందిన కూరేటి వెంకటేశ్వరరావు వేడుకున్నారు. తన కుమారుడు మోహనశేషు కుమార్‌తో వెళ్లి ఎస్పీని వేడుకున్నారు. ఆరోగ్యం బాగలేని తన కుమారుణ్ణి అతని భార్య వదిలేసి కుమార్తెను తీసుకుని వెళ్లిపోయిందని, వృద్ధాప్యంలో తమకు అండగా ఉండాల్సిన కుమారుడికి అన్ని తానై సపర్యలు చేస్తున్నానని వివరించారు. వాలంటరీ రిటైర్మెంట్ అవకాశం కల్పించాలని వేడుకోగా హోం గార్డుల ఒక్కరోజు వేతనం ద్వారా రూ 5.లక్షలు మంజూరు కానున్నాయి.

కూలీలను పంపలేదని పొలం రాయించుకున్నారు..

పొగాకు బ్యారన్‌కు కూలీలను తరలించేందుకు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రైతులు తనకు రూ 6.70 లక్షలు ఇవ్వగా కూలీలను సమీకరించేందుకు మరో వ్యక్తి ద్వారా పరిచయమైన పిడుగురాళ్ల లెనిన్ నగర్‌కు చెందిన పాలడుగు సాంబయ్య, పేరం సాగర్ ముప్పాళ్ల మండలం పలుదేవర్లపాడుకు చెందిన సిద్ధి శేషగిరిలకు రూ.6.70 లక్షలు ఇవ్వగా కూలీలను పంపించకుండా, డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, డబ్బులు ఇచ్చిన రైతులు తన పొలం రాయించుకున్నారని చిలకలూరిపేట మండలం కావూరుకు చెందిన కిన్నెర వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. దీనిపై న్యాయం చేయాలని ఏడాదిన్నరగా పోలీసులు చుట్టు తిరిగినా ఫలితం లేదని చెప్పారు.

ఉద్యోగం పేరుతో రూ.10 లక్షల మోసం

విఆర్వో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పగా ఉన్న పొలం అమ్మి 2015లో రూ.7 లక్షలు, అప్పులు చేసి 2016లో రూ 3 లక్షలు మొత్తం రూ.10 లక్షలు తీసుకున్న ఈపూరు మండలం అంగలూరుకు చెందిన బొమ్మనబోయిన రామాంజనేయులు మొహం చాటేశాడని నూజెండ్ల మండలం ఐనవోలుకు చెందిన ఆసా నరసింహారావు ఫిర్యాదు చేశారు. రామాంజనేయులు ప్రకాశం జిల్లా దర్శిలో మెడికల్ దుకాణం పెట్టుకొని ఉన్నాడని తెలిసి నిలదీయగా కొంత సమయం కావాలని చెప్పాడని, అనంతరం ఇటీవల అంగలూరు వచ్చి స్థిర పడిన రామాంజనేయులును మళ్లీ డబ్బులడిగానని, అయితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయారు. మోసపోయామనే మనస్థాపంతో తండ్రి గుండెపోటుతో మృతి చెందారని, ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరారు.

స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారు

1985లో మండల కేంద్రమైన క్రోసూరు ఎస్సీ కాలనీలో సర్వే నం.552 ఎ, బి లలో 2 సెంట్ల స్థలాన్ని రెవెన్యూ అధికారులు మంజూరు చేశారని, సెంటు స్థలంలో రేకుల షెడ్ వేయగా మిగతా ఖాళీ స్థలంలో తమ అనుమతి తీసుకుని గడ్డివాము వేసిన దుగ్గి రామయ్య, మరియమ్మ చివరికి నకిలీ పత్రాలు సృష్టించి స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నాడని క్రోసూరుకు చెందిన పసుమర్తి ప్రమీల ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని చెప్పారు.

ద్విచక్ర వాహనాన్ని అపహరించారు

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం విధుల్లో భాగంగా రొంపిచర్లలో గోపు అలివేలమ్మ ఇంట్లో నివాసం ఉన్నానని, గతేడాది తన భర్త గుండెపోటుకు గురై మృతి చెందడంతో తన ద్విచక్ర వాహనాన్ని పక్కన్ను తానం రాంబాబు ఇంట్లో ఉంచి పొన్నూరు వెళ్లి కొన్ని నెలలపాటు రాలేకపోయానని, ఇదే అదునుగా భావించిన రాంబాబు కుటుంబ సభ్యులు తన ద్విచక్ర వాహనాన్ని అపహరించారని ఓ ఉద్యోగి ఫిర్యాదు చేశారు. దీనిపై తాను గతంలోనే రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా బండి అప్పగిస్తామని చెప్పి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్నారని చెప్పారు.

పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదు

తన భర్త అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని సమీప బంధువులే ప్రతి విషయానికీ దుర్భాషలాడుతున్నారని రాజుపాలెం మండలం బలిజేపల్లి శ్రీను, వీరరాఘవమ్మ దంపతులు ఫిర్యాదు చేశారు. ఇటీవల తుపానుకు తాము సాగు చేస్తున్న మిరపతోట మునిగిందని, దీన్ని చూడ్డానికి పొలం గట్టు మీదుగా తన భర్త సోదరుడు వెలుగొండయ్య సాగు చేస్తున్న మొక్కజొన్న పొలంలోకి వెళ్లాడాన్ని ఓర్వలేక అతని కుమారుడు శ్రీనివాసరావు, భార్య దుర్భాషలాడారని చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని పోలీసు అధికారులను పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగన్ననకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఉద్యోగాలు పేరుతో మోసం, ఆన్‌లైన్ ద్వారా డబ్బులు మోసపూరితంగా తీసుకోవడం, కుటుంబ, ఆస్తి, పొలం, ఇతర ఆర్థిక అంశాలపై అధికంగా ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అర్జిదార్లకు దాతలు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు కెవి మహేష్, బి.ఆదినారాయణ, పి.రాజు, యు.రవిచంద్ర, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బంగారం కోల్పోయిన రైతులకు పరిహారంపై మరోసారి వినతి

ప్రజాశక్తి - క్రోసూరు

దొడ్లేరులోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో కొద్ది నెలల కిందట మాయమైన రైతుల తనఖా బంగారం విషయమై బ్యాంకు మేనేజర్‌ను ప్రజా సంఘాల నాయకులు సోమవారం కలిశారు. కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ బాధిత రైతులకు నష్ట పరిహారం వారంలో చెల్లించేందుకు చర్యలు చేపట్టకుంటే ఆందోళన చేపడతామని చెప్పారు. మేనేజర్ శివశంకర్ మాట్లాడుతూ బంగారం మాయంపై విచారణ జరుగుతోందని, ఖాతాదారుల సంచుల్లో బంగారం ఒకరి వస్తువులు మరొకరివి కలపటం వల్ల సమస్య మరింత జఠిలమైందని చెప్పారు. దీనిపై చర్యలకు మరికొంత సమయం పడుతుందని, బంగారానికి డబ్బులు చెల్లించేందుకు ఉన్నత స్థాయి అధికారులు చర్చిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఆవుల ఆంజనేయులు, సాంబిరెడ్డి, ఎం.రామకృష్ణారెడ్డి, డి.చిన్నగోపి, రవూఫ్, నాగుల్ షరీఫ్ పాల్గొన్నారు.



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న నాయకులు

కౌలు రైతులకు నష్టపరిహారం లేనట్లేనా ?

ప్రజాశక్తి - దుగ్గిరాల

తుపాను కారణంగా నష్టపోయిన పంట పొలాలు సర్వే చేయమని ప్రభుత్వం ఇచ్చిన జీవోతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడినది. ఈ క్రాప్ నమోదు చేసిన పంటలకు మాత్రమే సర్వే చేసే పరిస్థితి ఏర్పడినది. డెల్టా ప్రాంతంలో దాదాపు 70 శాతం వరకు ఉన్న రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేయించలేని పరిస్థితి. భూ యజమాని పాస్ పుస్తకం, ఆధార్‌తో బాటు సంతకం పెట్టవలసి ఉంటుంది. దీనితో ఈ క్రాప్ బుకింగ్ చేయించిన కౌలు రైతులు నామ మాత్రమే. 33శాతం కన్నా ఎక్కువ పడిన చేలు విత్తనం మొలకెత్తిన చేలు మాత్రమే సర్వే చేయాలని జీవోలో పేర్కొన్నట్లు తెలిసింది. దీనితో కౌలు రైతులు ఈ క్రాప్ చేయించని రైతులు నష్టపరిహారం అందక నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

సర్వర్ పనిచేయడం లేదని నమోదు చేయలేదు

పసుపులేటి నరేంద్ర, కౌలు రైతు, ఈమని

ఆరు ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. ఈ క్రాప్ నమోదు చేయమని నాలుగు రోజులు ఆర్‌బికె చుట్టూ తిరిగాను. సర్వర్ సరిలేదని చేయలేదు. రోజు కూలి పనులకు వెళుతు కౌలుసాగు చేస్తున్నాను. పని మానేసి ప్రతిరోజు తిరగలేక వెళ్లలేదు. అందవల్ల ఈ క్రాప్ నమోదు చేయించలేదు. ప్రస్తుతం చేలో నీళ్ల బయట వెళ్ళటానికి రూ.4వేలు ఖర్చుపెట్టి కాలువలు బాగు చేసుకున్నాను. కౌలు రైతులకు ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా పంట నష్ట పరిహారం ఇవ్వాలి.

నిండా మునిగాము

మాగం బాబు, కౌలు రైతు, ఈమని

ఐదెకరాలు కౌలుకు సాగు చేస్తున్నారు. తుపాను నిండా ముంచింది. ప్రజాప్రతినిధులు ఎవరూ ఇంతవరకు రాలేదు. కలెక్టర్ వచ్చిన రోజు మాత్రం కొంచెం కాలువల మరమ్మతులు చేశారు. ఎకరాకు రూ. కౌలు 30వేలు, పెట్టుబడి రూ.30వేలు వెరసి మొత్తం 5లక్షల వరకు నష్టపోయాము. అదుకునే వారు కనబడటం లేదు.

నీళ్లల్లోనే నానుతున్న పొలం

గండికోట నారాయణ, కౌలు రైతు, ఈమని

ఎకరం రూ.25వేలకు దేవాదాయ భూమిని కౌలుకు తీసుకున్నాను. ఈ క్రాప్ నమోదు చేయించాను. రుణం కోసం బ్యాంకునకు వెళ్లే దేవాదాయ శాఖ కార్యదర్శి సంతకం కావాలన్నారు. కార్యదర్శి సంతకం పెట్టలేదు. దీనితో బయట వడ్డీకి అప్పు తీసుకువచ్చి వ్యవసాయం చేశారు. ప్రస్తుతం చేను నీళ్లల్లో మునిగే ఉంది. పంట పూర్తిగా నష్టపోయే పరిస్థితి. వడ్డీలకు వడ్డీ కడుతున్నాను. పస్తుతం చేను నీళ్లలో మునిగే ఉంది. పంట పూర్తిగా నష్టపోయే పరిస్థితి. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

భూయజమాని ఆమోదిస్తేనే కౌలు రైతుకు ప్రయోజనం

పి శిరీష , మండల వ్యవసాయ అధికారి

పంట నష్టపోయిన కౌలు రైతులు ఇప్పటికైనా భూ యజమాని సంతకం తో ఆమెదం పొందితే కౌలు రైతుకు ప్రయోజనం ఉంటుంది. ఆ లిస్టును ప్రత్యేకంగా ప్రభుత్వానికి పంపుతాము.

అయితే ప్రభుత్వ జీవోలో ఈ అంశం ఎక్కడా లేదని రైతులు తెలుపుతున్నారు.

నేలవాలిన వరితో నూర్పిడి ఖర్చు భారం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

వారం రోజులుగా వరి పొలాల అన్నదాతలను తుపాను పెనుగాలులు తీవ్రంగా నష్టపరిచాయి. చేతికి అంది వచ్చిన వరి పైరు కళ్ళముందే నీటిలో నాని వారికి తీవ్ర కన్నీటిని మిగిల్చింది. మరోవైపు వరి పొలాల్లోని మురుగు పది రోజులుగా బయటకు వెళ్లకపోతే వరి పనులు నీటిలో నాని, ధాన్యం రంగు మారి మొలకలు రావటంతో రైతులు విలవిలలాడుతున్నారు. ఎకరం పొలంలో గంటలో నూర్పిడి చేయాల్సిన నూర్పిడి యంత్రాల కు సుమారు రెండున్నర గంటల సమయం పడుతుంది. దీనివల్ల గంటకు రూ.3000 ఖర్చు రూ.7500 అవడంతో అదనంపు భారం పడిందని రైతులు వాపోతున్నారు. మరోవైపు పొలంలో మురుగు నీరు బయటకు వెళ్లక పోవటంతో కోతకు వచ్చిన వరి చాప మాదిరిగా నేలమట్టమయింది. మురుగునీరు బయటకు వెళ్లే వరకు వరి నూర్పిడ్లు చేయడం కష్టసాధ్యంగా మారింది. మరో అల్పపీడనం గండం పొంచి ఉందన్న వార్తలతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి యంత్రాలతో నూర్పిలు చేసి రోడ్లపై ధాన్యాన్ని రాశులుగా పోసి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పొలాల్లో మురుగు నీరు ఇంకా బయటకు వెళ్లకపోవడంతో దిగుబడులు సగానికి సగం తగ్గాయని, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని వరి ధాన్యం కు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ముంపుతో అల్లాడుతున్న రైతులు

కాటూరి శ్రీనివాసరావు, రైతు

పొలాల్లో మురుగు నీరు చేరి బయటకు పోవడానికి దారిలేక పంట నీళ్లలోనే నానుతంది. ప్రభుతవం నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలి. ఈ క్రాప్ ఇన్సూరెన్స్ మంజూరు చేయాలి. రబీలో రెండో పంట కింద మినుము, మొక్కజొన్న, ఎరువులను సబ్సిడిపై అందజేయాలి.

తడిసి, రంగు మారిన ధాన్యాన్ని

మద్దతు ధరకు కొనాలని వినతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



వినతి పత్రం ఇస్తున్న జొన్నా శివశంకరరావు తదితరులు

మిచౌంగ్ తుపాన్ కారణంగా తడిసి, రంగు మారిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంటిఎంసీ పరిధిలోని గుండి మెడ గ్రామంలో పొలాల గురించి సోమవారం ఆర్‌బికె వ్యవసాయ అధికారి కె.వెంకటేశ్వరావుని రైతు, కౌలు రైతు సంఘం నాయకులతో కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతాంగం, కౌలు రైతుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అధిక వర్షాలు కురిసినప్పుడు పంటలన్నీ నీట మునుగుతున్నాయని, రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. పంటలు నీట మునగడానికి పంట పొలాల్లో ఉన్న డ్రైనేజీ కాలువలు పూడుకుపోవడమే ప్రధాన కారణమని ఆయన అన్నారు. వెంటనే వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి, ధాన్యం రైతులకు ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు నష్ట పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా కౌలు రైతు గుర్తింపు కార్డుతో సంబంధం లేకుండా పంట నష్టపోయిన కౌలు రైతులకు, రైతులకు నష్టపరి హారం అందించాలన్నారు. రబీ సీజన్లో విత్తనాలను ఉచితంగా రైతులకు అందజే యాల న్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కౌలు రైతులు డి భాగ్య రావు, కోటేశ్వరరావు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో నీళ్లు బయటకు పంపాలని వినతి

ప్రజాశక్తి - తాడికొండ : తుపాను వర్షాలకు పొలాలు నీటమునిగి మొలకలు వచ్చాయని నీటిని బయటకు పంపి ఆదుకోవాలని తాడికొండ అక్కదేవత చెరువు దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సమస్య పరిష్కరించాలని కోరతూ తహశీల్దార్ ఫణింద్రబాబునకు వినతి పత్రం ఇచ్చారు. చెరువు భూముల్లో తిరిగి పంటలు వేసుకోవడానికి నీళ్ల ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు. వందేళ్లుగా చెరువు భూములు సాగు చేసుకుంటున్నామని, తుపాను వర్షాలకు పూర్తిగా మునిగిపోయామన్నారు. పంట నష్టపరి హారం ఇప్పించి ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రైతు సంఘం నాయకులు పూర్ణచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎస్ చంగయ్య

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన మున్సిపల్ కార్మికుల విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగించారు. 12వ తేదీన విజయవాడలో జరిగే నిరాహార దీక్షకు మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. అదేవిధంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 21వ తేదీ నుండి నిరవధక సమ్మెకు మున్సిపల్ కార్మికులు వెళతారని తెలిపారు. సమావేశంలో యూనియన్ నాయకులు పి పూర్ణ, ఎస్ మంగయ్య, ఎం వెంకటేష్ రమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వెలుగు జాతీయ సాహిత్య పురస్కారం

అందుకున్న ఆళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ళ నాగేశ్వరరావు తెలుగు వెలుగు జాతీయ సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణా రాష్ట్రం వరంగల్ కు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక ఈనెల 10న విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించిన జాతీయ సాంస్కృతిక సంగీత సాహిత్య నృత్య సమ్మేళనం 2023లో భాగంగా ఆళ్ళకు జాతీయ సాహిత్య పురస్కారాన్ని అందించి, సాహిత్య బందువు పురస్కారంలో సత్కరించినట్లు సోమవారం ఆళ్ళ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సాహితీ ప్రియులు అభినందించారు. కార్య క్రమంలో నిర్వాహక సంస్థ అధ్యక్షులు పి,రాజ్‌కుమార్, గౌర వాధ్యక్షులు పి.యోహాను, సంస్థ ప్రతినిధులు ఆర్ రమేష్, కవి పి.వెంకటేశ్వర్లు, ఇస్రో మాజీ చైర్మన్ చందు సాంబశివరావు, నటరాజన్ పాల్గొన్నారు.

పంట పొలాలనుపరిశీలించిన ఎఒ కిరణ్మయి

కొండపాటూరులో పొలాల పరిశీలన

ప్రజాశక్తి -పెదనందిపాడు

మిచౌంగ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి బి కిరణ్మయి సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నష్టపోయిన వరి, మిరప పంటల నమోదును ఆర్‌బికె కేంద్రాల పరిధిలో చేపట్టామని, మిగతా పంటల నష్టాన్ని కూడా నమోదు చేస్తామని తెలిపారు. పంటల నష్టాన్ని గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులతో ఆమె మాట్లాడారు. నష్టపోయిన శనగ రైతులకు సబ్సిడీ మీద విత్తనాలు త్వరలో అందజేస్తామని తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ కార్యాలయంలో అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల అధికారులతో సమావేశం నిర్వహించారు. దెబ్బతిన్న పంటల నమోదు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని వారికి సూచించారు, కార్యక్రమంలో ఎంపిఇఒ ఎం శివప్రసాద్, ఎఇఒ సిహెచ్ నారాయణ, ఆర్‌బికే సిబ్బంది పి శ్వేతా కృష్ణ, బి సుధారాణి, కే సౌమ్య పాల్గొన్నారు.

సోమేపల్లి వెంకటసుబ్బయ్య కలిసిన మల్లెల రాజేష్ నాయుడు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య కుమారుడు, వైసిపి నాయకులు, మురికిపూడి సొసైటీ అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్యను ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లెల రాజేష్ నాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని పండరీపురంలో ఉన్న వెంకటసుబ్బయ్య నివాసానికి వెళ్లి ఆయన్ను సత్కరించడంతోపాటు కొద్దిసేపు సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చిలకలూరిపేట స్థానానికి రాజేష్ నాయుడుకే టిక్కెట్ ఇస్తారనే ప్రచారం మొదలైంది. మరోవైపు జ్ఞానేశ్వర ఫౌండేషన్ అధినేత జాన్సైదా కూడా టికెట్ ఆశిస్తుండడంతో నియోజకవర్గంలో తాజా పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి.

నెలల తరబడి రోడ్డు పక్కనే 'చెత్త'ఆటో

ప్రజాశక్తి - అమరావతి

చెత్త సేకరణ కోసం తెప్పించిన ఆటోలను సరిగా నిర్వహించడం లేదు. మండలంలోని వైకుంఠపురంలో చెత్త ఆటోను తెప్పించారు. కొద్ది నెలలపాటు దీన్ని వినియోగించినా పాడైన కారణంగా స్థానిక ప్రధాన రోడ్డు పక్కన పెట్టారు. రెండు మూడు నెలలైనా దానికి మరమ్మతులు చేయించకుండా అంతే పడేశారు. దీంతో రిక్షాల ద్వారానే చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి : టిడిపి

ప్రజాశక్తి-ముప్పాళ్ల : మండలంలోని మాదల, రామకృష్ణాపురం గ్రామాల్లో తుపాను ప్రభావిత మిర్చి, శనగ పొలాలను టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ సోమవారం పరిశీలించారు. తుపాను వల్ల పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయని, రైతులు అప్పులు చేసి మరీ పెట్టుబడులతో పంటలు సాగు చేశారని అన్నారు. ఈ ఏడాది రెండుసార్లు పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. బాధిత రైతులందరికీ తక్షణమే నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో నాయకులు వి.సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు, బి.సుబ్బారావు, ఎస్.రాజశేఖర్, బి.వందనాదేవి, కె.శ్రీనివాసరావు, ఆర్.నాన్నయ్య,మండల అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి : స్థానిక అమరేశ్వరాలయాన్ని, సాయిబాబా మందిరాన్ని టిడిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ సోమవారం సందర్శించారు. దేవస్థానం ఈవో వేమూరి గోపి, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఇటీవల మరణించిన సీనియర్ పాత్రికేయులు కుర్రా చెంచయ్య చిత్రపటానికి కన్నా పూలమాలలేసి నివాళులర్పించారు. ఆయనవెంట టిడిపి నాయకులు టి.వెంకటేష్ యాదవ్, సిహెచ్.జాజిబాబు, బి.వెంకటేశ్వరరావు, రామకృష్ణ ఉన్నారు.

గుడి సాకుతో స్థలం కబ్జా యత్నం

సర్వే రిపోర్ట్ కోసం రెండేళ్లుగా తిరుగుతున్నాం

నరసరావుపేట పట్టణంలోని 24వ వార్డులో తమకు కుటుంబ పరంగా రెండు సెంట్లు స్థలం లభించిందని, ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే మున్సిపల్ అధికారులు సర్వే రిపోర్ట్ ఇవ్వాల్సి ఉందని, దీనికోసం రెండేళ్లుగా మున్సిపల్ అధికారులు ఇవ్వడం లేదని సరికొండ హనుమాయమ్మ ఫిర్యాదు చేశారు.

మా స్థలంలో గుడి కట్టే యత్నం

1998లో అప్పటి ప్రభుత్వం ఎస్టీ ఎరుకుల సామాజిక తరగతికి చెందిన కొందరికి కొంత స్థలం మంజూరు చేసిందని కాగా సమీప బంధువుల వద్ద నుండి స్థలాన్ని కొనుగోలు చేశామని, అయితే ఇటీవల గ్రామానికి చెందిన వాలంటీర్ వెంకటేశ్వర్లు, తోకల వెంకటేశ్వర్లు, విఆర్వోలు కలిసి తమ స్థలంలో కొంత స్థలాన్ని ఆక్రమించి గుడి నిర్మాణం చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఇదేమని ప్రశ్నిస్తే దాడి చేసి గాయపరిచారని నరసరావుపేట మండలం పాలపాడుకు చెందిన కె.వెంకట కోటయ్య ఫిర్యాదు చేశారు.

అటవీ భూమికి హక్కులు కల్పించాలని వినతి

అటవీ భూమిని 25 ఏళ్ల నుండి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, దీనికి సంబంధించి పట్టా మంజూరు చేయించాలని వెల్దుర్తి మండలం వజ్రాలపాడు తండాకు చెందిన ఇస్లావత్ నాగేశ్వరరావు వేడుకున్నారు. ఇదే ప్రాంతంలో 26 మంది వరకు కుటుంబాలు కొంత అటవీ భూమిని బాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, ఇటీవల సర్వే చేసిన అధికారులు జిపిఆర్ఎస్ మ్యాపులు తప్పుగా నమోదు చేశారని, భూములు బాగు చేసుకుని సాగు చేసుకుంటున్న తండావాసులకు పట్టాలు మంజూరు చేసి హక్కులు కల్పించాలని వేడుకున్నారు.

భర్త మృతి చెందాడు..కంటి చూపు పోయింది

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందాడని, కొన్నాళ్ళకు అనారోగ్యంతో కంటి చూపు కోల్పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే సదరన్ సర్టిఫికెట్ అడుగుతున్నారని, తన పెన్షన్ మంజూరుకు కావాల్సిన ఏర్పాట్లు చేయించడంతో పాటు తమ కుటుంబానికి ఆర్థికంగా న్యాయం చేయాలని మాచర్ల మండలం పసువేములకు చెందిన లక్ష్మీభాయ్ వేడుకున్నారు.

మూడేళ్లుగా పింఛను రావడం లేదు

వైసిపి అధికారంలోకి వచ్చాక ఒకేడాది పాటు పెన్షన్ ఇచ్చారని, తర్వాత నుండి వేలి ముద్రలు తీసుకోవడం లేదని చెబుతూ పెన్షన్ ఇవ్వడం లేదని, గ్రామ సచివాలయంలో, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పని కావడం లేదని బొల్లాపల్లి మండలం మన్నెసుల్తాన్పాలెం తండాకు చెందిన కత్రావత్ పికి భాయ్ చెప్పారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్నానని చెప్పారు.

భూ ఆక్రమణలు పట్టణ రెవెన్యూ అధికారులు

రొంపిచర్ల మండలం గోగులపాడుకు చెందిన సాతులూరి పిచ్చమ్మ, కోటేశ్వరమ్మ భూమిని ఆక్రమించాలని చూస్తున్న అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పిడిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



కార్యక్రమంలో పిడిఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటానాయక్, ఎంబిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పుడి అంజమ్మ పాల్గొన్నారు.

పల్నాడు కలెక్టర్ స్పందనకు107 ఫిర్యాదులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని జిల్లా అధికారులను జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుండి 107 ఫిర్యాదులు స్వీకరించారు. అర్జిదార్లకు ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వసంతబాబు, డిఆర్ఓ వినాయకం పాల్గొన్నారు.

పదేళ్లుగా మార్చని ఫిల్టర్ బెడ్ ఇసుక

ప్రజాశక్తి - క్రోసూరు

ఊటుకూరు సిపిడబ్ల్యూఎస్ స్కీమ్ ఫిల్టర్ బెడ్లో ఇసుక నింపి స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు కోరారు. రెండ్రోజులుగా ఈ స్కీం ద్వారా వస్తున్న నీరు పచ్చని రంగుతో, కలుషితంగా ఉంటోందని, అచ్చంపేట మండలం కస్తల్లో ఉన్న స్కీం ఫిల్టర్ బెడ్లను సిపిఎం ప్రతినిధి బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా అనంతరం రవిబాబు మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్లో ఉండాల్సినంత ఇసుక లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఫిల్టర్ బెడ్లలో పదేళ్ల నుండి ఇసుక నింపనట్లు తమ పరిశీలనలో తెలుస్తోందని, అయినా అధికారులు మిన్నకుండడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. పరిశీలనలో సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, నాయకులు జి.మధుసూదనరావు, జి.మహేష్ పాల్గొన్నారు.

డెడ్ అయిన ఫిల్టర్ బెడ్ను పరిశీలిస్తున్న నాయకులు

కంటెపూడిలో 'బాబూజి' చిత్రీకరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బాబూ జగ్జీవన్రామ్ జీవిత చరిత్రలోని కొన్ని సన్నివేశాలను సత్తెనపల్లి మండలం కంటిపూడి చెరువు దగ్గర సోమవారం సినీ దర్శకుడు దిలీప్ రాజా చిత్రీకరించారు. షూటింగ్ అనంతరం విశేషాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. ఈ లొకేషన్లో అందమైన గ్రీనరీ ముందు జాగజ్జీవన్రామ్ పాత్రధారిపై మాంటేజ్ షాట్స్ తీసినట్లు చెప్పారు. 'బాబూజి' టైటిల్తో ఈ బయోపిక్ను వాస్తవికతకు దగ్గరగా రూపొందిస్తున్నామన్నారు. 115 ఏళ్ల క్రితం జరిగిన వాస్తవ కథ కావడంతో నాటి సామాజిక పరిస్థితులను బేరీజు వేసుకుంటూ స్క్రీన్ ప్లే తయారు చేశామని, సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లోని బెల్లంకొండ అడ్డరోడ్డు, తారకరామ సాగర్ లోకేషన్లు 'బాబూజి' సినిమాకు ఎంతగానో సరిపడే విధంగా ఉన్నాయని అన్నారు. ఆహార శాఖామంత్రిగా జగ్గీవన్రామ్ కరువు ప్రాంతాల్లో పర్యటించే సన్నివేశాలను బెల్లంకొండ అడ్డరోడ్డు వద్ద త్వరలో చిత్రీకరిస్తామని తెలిపారు. ఆ రోజుల్లో కరెంటు, రోడ్లు, లేనందువలన బెల్లంకొండ అడ్డరోడ్డు లొకేషన్ ఎంపిక చేశామని తెలిపారు. జగ్జీవన్రామ్ పాత్రలో మాజీ సైనికుడు మిలటరీ ప్రసాద్ నటిస్తుండగా లోక్సభ మాజీ స్పీకర్ మీరా కుమార్గా తాళ్లూరి రామేశ్వరి, లాల్ బహదూర్ శాస్త్రిగా ఉత్తర ప్రదేశ్ నటుడు అమీర్ ఛోద్రి, మహాత్మా గాంధీగా కేఆర్. డి. షెట్టి, గాంధీజీ శిష్యురాలు మను పాత్రలో పూజా కరారి నటిస్తున్నారని వివరించారు. నిర్మాత ఆలూరి సుందరామయ్య కాగా కథ, మాటలు, స్క్రీన్ప్లే, దర్శకత్వం దిలీప్ రాజా వ్యవహరిస్తున్నారు.

వెయిట్ లిఫ్టింగ్లో ఎస్కెబిఆర్ విద్యార్థి సత్తా

ప్రజాశక్తి - మాచర్ల : రాజమండ్రి నన్నయ్య యూనివర్శిటీలో జరుగుతున్న సౌత్జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మాచర్ల ఎస్కెబిఆర్ డిగ్రీ కాలేజి విద్యార్థి మంజుల ఆశోక్బాబు కాంశ్య పతకం సాధించారు. ఆశోక్ కొంత కాలంగా పట్టణంలోని హనుమాన్ వ్యాయమశాలలో శిక్షణ పొందుతున్నారు. గతంలోనూ అనేక పోటీల్లో పతకాలు సాధించిన అశోక్ తాజాగా మరో పథకం సాధించడంపై అధ్యాపకులు, కోచ్ ఆదివిష్ణుయాదవ్ అభినందించారు.

ఖనిజ సంరక్షణకు కెసిపి ప్రాధాన్యం

ప్రజాశక్తి - మాచర్ల : కెసిపి మైన్స్లో మైన్స్ ఎన్విరాన్మెంటల్ మినరల్ కన్వర్షన్ వీక్ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన కెసిపి సీనియర్ జనరల్ మేనేజర్ వెంకటరమణారావు మాట్లాడుతూ కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు ఎంతో ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. ప్రభుత్వం నిబంధనల మేరకు మైన్స్లో కార్యకలాపాల నిర్వహణ జరుగుతుందన్నారు. కెసిపి సంస్థల సీఎమ్డీ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏడాది పర్యావరణ పరిరక్షణ దినోత్సవంగా నిర్వహిస్తూ వందల మొక్కలను మైన్స్ ప్రదేశాల్లో నాటుతున్నట్లు తెలిపారు. సమిష్టి కృషితో ప్రమాద రహిత పని ప్రదేశంగా కేసీపీని నడపటం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఐబిఎం ఇన్స్పెక్షన్ టీం సభ్యులు కె.రామిరెడ్డి, ఎం.మనోజ్, ఉపేంద్ర పాల్గొని కెసిపి సంరక్షణ చర్యల పట్ల అభినందనలు తెలిపారు.

ఆర్‌కెకు మద్దతుగా రాజీనామాలు

ప్రజాశక్తి-తాడేపల్లి :మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మంగళవారం తన పదవికి రాజీనామా చేయడంతో తాడేపల్లి పట్టణం, మండలంలోని పలువురు వైసిపి నాయకులు పార్టీకి తమ రాజీనామా సమర్పించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ మేకా వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు, రూరల్ అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి, మంగళగిరి గంగాభ్రమరాంబ దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు, ఉండవల్లికి చెందిన కొల్లి ముసలారెడ్డి, తాడేపల్లికి చెందిన నాయకులు రాజీనామాలు చేశారు.

ప్రజాశక్తి - మంగళగిరి

ఆర్కేకు మద్దతుగా మంగళగిరిలో పలువురు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిం చారు. గుంటూరు జిల్లా వైయస్సార్ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా గుంటి రాజ్యలక్ష్మి , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బుర్రముక్కు భారతీదేవి తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వైఎస్ఆర్సిపి పట్టణ మహిళా మాజీ అధ్యక్షురాలు గోలి కస్తూరి పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

రాజీనామా కారణాలు త్వరలో తెలియజేస్తా

మీడియా సమావేశంలో ఆళ్ల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సోమవారం ఎమ్మెల్యే పదవికి, వైఎస్ఆర్ సీపీకి రాజీనామా చేసినట్లుగా మంగళగిరి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. తాను 1995 నుండి కాంగ్రెస్ పార్టీలో పని చేశానని తెలిపారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో సత్తెనపల్లి అసెంబ్లీ సీటు కోసం ప్రయత్నించానని, అయితే సీటు రాలేదని తెలిపారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పెదకూరపాడు అసెంబ్లీ నియోజక వర్గం సీటు కాంగ్రెస్ తరపున ఇవ్వమని ప్రయత్నించానని అయినా ఫలించలేదని అన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్‌పార్టీలో పనిచేస్తూ వచ్చేనని అన్నారు. ఆ తర్వాత జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్ఆర్సిపి ఏర్పడిందని ఆ పార్టీలో పని చేశానని తెలిపారు. పెదకాకాని గ్రామానికి చెందిన తను తాను మంగళగిరి అసెంబ్లీ నుండి 2014, 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి తరపున పోటీ చేసి విజయం సాధించానని తెలిపారు. రాజీనామా లేఖను స్పీకర్ లేకపోవడంతో ఓ ఎస్ డి కి అందజేసినట్లుగా తెలిపారు. వైఎస్ఆర్సిపి పార్టీ కూడా రాజీనామా చేసినట్లుగా తెలిపారు. రాజీనామాకు కారణాలు ఏమిటని విలేకరుల ప్రశ్నించగా త్వరలో తెలియజేస్తానని తెలిపారు. బలమైన కారణం ఉండడంతోనే రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలిపారు.

నియోజవర్గంలో వైసీపీలో అంతర్గత పోరు..

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం లో ఒక సంవత్సర కాలం నుండి పార్టీలో అంతర్గత పోరు జరుగుతుంది. టిడిపిలో ఉన్న మురుగుడు హనుమంతరావు వైసీపీ లకు చేరి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. గతంలో టిడిపి తరపున మున్సిపల్ చైర్మన్గా గంజి చిరంజీవి పోటీ చేసి విజయం సాధించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి తరపున గంజి చిరంజీవి పోటీ చేసి ఆనాటి వైసిపి అభ్యర్థి ఆళ్ల రామకృష్ణా రెడ్డి పై 12 ఓట్ల తేడాతో చిరంజీవి ఓడిపోయారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గంజి చిరంజీవ 2022 అక్టోబర్ నెలలో టిడిపికి రాజీనామా చేసి వైసిపిలకు చేరారు. ఆ తర్వాత గంజి చిరంజీవికి రాష్ట్ర ఆప్కో చైర్మన్ పదవి వరించింది. గత ఆరు నెలల నుంచి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ వైసిపి అధ్యక్షులుగా దొంతి రెడ్డి వేమారెడ్డిని వైఎస్ఆర్సిపి నియమించింది. ఆ తర్వాత తన కార్యాలయాన్ని మంగళగిరిలో ప్రారంభించారు. ఈనెల 10వ తేదీన మంగళగిరిలో దొంతి రెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులంతా ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా మాట్లాడారు. అదీకాక ఈసారి మంగళగిరి అసెంబ్లీ సీటు బీసీలకు కేటాయిస్తారని ప్రచారం ముమ్మరంగా జరుగుతుంది.

ఆడుదాం ఆంధ్రాపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో జరిగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సోమవారం మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వి.నిర్మలా కుమార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్రీడా ప్రాంగణం గుర్తించడం, మౌలిక సదుపాయాల ఏర్పాటు, ఇంటి పన్ను వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కమిషనర్ కోరారు. సమావేశంలో కార్పొరేషన్ సెక్రటరీ పి శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ అధికారులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్, సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏ ప్రభాకర్, జి దుర్గారావు, ఎం కష్ణ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే అభిమానులు నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి అసెంబ్లీ నియోజవర్గానికి వైసీపీ ఇన్చార్జిగా గంజి చిరంజీవిని నియమించడాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే ఆర్కే అనుచరులు ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం వద్ద సోమవారం రాత్రి నిరసన వ్యక్తం చేశారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గాన్ని ఎన్నడు లేని విధంగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే ఆర్కేకు అన్యాయం చేయడం ఏంటని ప్రశ్నించారు. రోడ్డుపై టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కోరినప్పటికీ ఆర్కే అభిమానులు వినిపించుకోలేదు. అయితే అయోధ్య రామ రెడ్డి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇక రాజకీయాలకు దూరంగా ఉంటారని చెప్పారు.

హామీలిచ్చి విస్మరిస్తే ఎన్నికల్లో గుణపాఠం తప్పదు

ప్రజాశక్తి-తెనాలి : ప్రతిపక్షంలో ఉండగా హామీలిచ్చి, అధికారంలోకి హామీలను విస్మరించే ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అగస్టిన్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై సోమవారం స్థానిక ధర్నాచౌక్‌లో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అగస్టిన్ మాట్లాడుతూ 2017లో అగ్రిగోల్డ్ బాధితుల దీక్షా శిబిరంలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని, అగ్రిగోల్డ్ యాజమాన్యంతో సంబంధం లేకుండా బాధితులను ఆదుకునేందుకు రూ.1180 కోట్లు మంజూరు చేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. కాని నేటికీ సమస్యలు అలాగే ఉండిపోయాయన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరిస్తే ప్రభుత్వానికి అండగాఉంటామన్నారు. లేని పక్షంలో ఈనెల 18న జిల్లా కేంద్రాల్లో నిరసనలు, 28, 29 తేదీల్లో మృతిచెందిన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలతో 30 గంటల దీక్ష చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరశింహారావు, బి.కృష్ణ, పలువురు బాధితులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారంపై అంచనా

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : తుపాను కారణంగా నష్టపోయిన పంటను అంచనా వేసేందుకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తెనాలి వ్యవసాయ సంచాలకులు ఎన్ ఉషారాణి మాట్లాడుతూ పంట నష్టంపై ఆర్బికే సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు సమయత్తమై పంట నష్ట నష్టపరిహారం అంచనా పై మంగళవారం నుంచి ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు మేరకు నష్టపరిహారంపై సమగ్రమైన అంచనా వేయాలని సిబ్బందికి సూచించారు. మంగళవారం నుంచి వారం రోజుల్లో పూర్తి పంట నష్టాన్ని అంచనా వివరాలను తెలియపర్చాలని తెనాలి తాశీల్దార్ కె రవిబాబు అన్నారు. కనీసం 33% నష్టం వాటిల్లితేనే పంట నష్టపరిహారంపై అంచనా వేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రేమ్ సాగర్, విఎఎ లు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి :గుడ్ షెపర్డ్ కాన్వెంట్‌లో స్వయంకృషి పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు మేనేజర్ రంగరాజు మాట్లాడుతూ స్వయం ఉపాధి ద్వారా మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడే విధంగా లోన్లు ఇచ్చి తాము సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. అవకాశాలను సృష్టించుకుని వాటిని ఆర్థిక మూలాలుగా మార్చుకోవాలని కోరారు. గ్రూపులుగా ఏర్పడి చిన్న కుటీర పరిశ్రమలు నిర్వహిస్తున్న వారికి కూడా తమ బ్యాంకు నుండి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. తాము స్వయంకృషి కోఆపరేటీవ్ ద్వారా బ్యాంకు అందించిన సాయంతో ఆర్థికంగా ఎలా పైకి ఎదిగి వచ్చామో వివిధ గ్రూపుల నుంచి మహిళలు మాట్లాడారు. డైరెక్టర్ సిస్టర్ లత మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. పురుషులతో పాటు మహిళలు వ్యాపార రంగంలో రాణించడం మంచి పరిణామమన్నారు. సిస్టర్ ఉదయ మాట్లాడుతూ మహిళలు సాధికారత సాధించేందుకు కోఆపరేటివ్ పరపతి సంఘం ఇస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గుడ్ షెపర్డ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్ర సంబరాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల :రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సాగుతుందని లోకేష్ పాదయాత్ర నిదర్శనమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకట్రావు అన్నారు స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 3000 కిలోమీటర్లు పూర్తి చేసిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత గద్దె శ్రీనివాస్ వ ల్లూరు నరసింహారావు జంపాల నరేంద్ర ఇత్తడి చంటి నక్క చిరంజీవి పర్వతనేని హర్ష కొంగర సుధీర్ ఎన్ రవి తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు నెరవేరలేదు : ఎంపి గల్లా

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

రాష్ట్ర విభజన సందర్భంగా జరిగిన ఇచ్చిన హామీలు కేంద్రం ఇంత వరకు నెరవేర్చలేదని గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ విమర్శించారు. సోమవారం ఆయన పార్లమెంటులో మాట్లాడుతూ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరలేదని వీటిని పట్టించుకోవాలన్నారు. దుగరాజపట్నం ఓడరేవు , విశాఖపట్నం, విజయవాడ-గుంటూరు-తెనాలిలో ప్రతిపాదించబడిన మెట్రో రైలు ప్రాజెక్టులు, . కొత్త రైల్వే జోన్, గ్రీన్‌ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ నిర్మాణం కాగితాలకే పరిమితం అయిందన్నారు. విభజన చట్టం ప్రకారం ఐఐటీ, ఐఐఎం, ఐఐఐటీ, ఎన్ ఐ టీ, ఐఐఎస్ఈఆర్, సెంట్రల్ యూనివర్సిటీ, పెట్రో యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు కావల్సి ఉందన్నారు. పూర్తి కావలిసిన విద్యాసంస్థల నిర్మాణం నత్తనడకన నడుస్తోందన్నారు. ఇటీవల సంభవించిన తుపాను వల్ల వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. తాను గత వారమే రూ.5వేల కోట్ల పరిహారం అడగ్గా ఇప్పటి వరకు రూ.500 కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. బాధల్లో ఉన్నరైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వెంటనే మానవత్వంతో రైతులను ఆదుకోవాలన్నారు.

ప్రధాని మోడీ వర్చువల్ సందేశం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఇండియాను అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించేందుకు యువత సిద్ధంగా ఉండాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. సోమవారం వర్చువల్‌గా యూనివర్సిటీల వీసీలు, విద్యాసంస్థల నిర్వాహకులు, అధ్యాపకులు ను ఉద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం ప్రపంచం మొత్తం భారత దేశాన్ని నిచితంగా పరిశీలిస్తుందన్నారు. దేశంలో మార్పునకు యువతే ప్రధాన భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. వర్సిటీలోని డైక్ మన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వర్చువల్ సమావేశంలో యూనివర్సిటీలోని కళాశాలల ప్రిన్సిపాల్స్ ,అధికారులు, విభాగాధిపతులు, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొని ప్రధాని మోడీ సందేశాన్ని తిలకించారు.

స్పందనకు నాలుగు అర్జీలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో నాలుగు అర్జీలు అందినట్లు తహసిల్దార్ శ్రీకాంత్ కేధార్‌నాద తెలిపారు. 1-బి అడంగల్ 2, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ 1, పట్టాదారు పాస్ పుస్తకం 1 మొత్తం 4 అర్జీలు అందినట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులకు పంపి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు.

వేధింపులపై కేసు

ప్రజాశక్తి తెనాలి :కట్నం వేధింపులపై పట్టణ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని చినరావూరుకు చెందిన వేజండ్ల కళ్యాణిని ఆమె భర్త రామారావు అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి తెనాలి :యువతి అదశ్యంపై పట్టణ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక రామలింగేశ్వరపేట శివారు గురవయ్య కాలనీకి చెందిన శిరీష ఎనిమిదో తరగతి వరకు చదివి ఇంటి వద్ద ఉంటుంది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇంట గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తుపాను కన్నా ప్రభుత్వ తప్పిదమే ఎక్కువ

దెబ్బతిన్న పంటపొలాలు పరిశీలించిన టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఇటీవల వచ్చిన తుపాన్ కన్నా ప్రభుత్వ తప్పిదం వలనే ఎక్కువగా పంట నష్టం జరిగిందని టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, జనసేన నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు, విమర్శించారు. సోమవారం మండలంలో ముంపునకు గురైన పొలలను టిడిపి, జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవిలో డ్రైనేజీ కాలువలకు మరమ్మతులు చేయకపోవడం వల్ల పంట నీట మునిగింద న్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమం త్రిగా ఉన్నప్పుడు పంట నష్టపోతే ప్రత్యేక జీవో జారీ చేసి నష్ట పరిహారం రూ.30 వేలు చెల్లించారని జగన్ నష్టపరిహారం రూ.20 వేలకు తగ్గించారని విమర్శించారు. రబి సీజన్ నాటికి సకాలంలో ఉచితంగా విత్తనాలు అందజేయాలని, రైతులందరికీ ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు పతాకం ఆవిష్కరణ

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్నంలోని కురగల్లు ఆటో స్టాండ్ 25వ వార్షికోత్సవ పురస్కరించుకొని మంగళగిరిలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద సిఐటియు పతాక ఆవిష్కరణ చేశారు. సిఐటియు పతాకాన్ని సీనియర్ నాయకులు జెవి రాఘవులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ నిత్యం ప్రయాణికులను గమ్యానికి చేర్చే మనం జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వం కార్మికుల పట్ల తెచ్చే చట్టాలను అందరూ ఐక్యంగా ఉండి ఎదుర్కోవాలని కోరారు. కేంద్రంలో ఉన్న బిజెపి రవాణా కార్మికులకు నష్టం చేకూర్చే నల్ల చట్టాలను తీసుకొస్తున్నదని దీని ద్వారా చిన్నచిన్న తప్పులకి పెద్దపెద్ద శిక్షలు వేసే విధంగా రవాణా కార్మికులను డ్రైవింగ్‌నకు దూరంగా చేసే విధంగా ఉన్నాయని, వీటిపై భవిష్యత్తులో కార్మికులు ఐక్యంగా పోరాటాల నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజ్ సిఐటియు జిల్లా కార్యదర్శి సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, ఆటో కార్మికులు సతీష్ తదితరులు పాల్గొన్నారు

కెఎల్‌యులో హీరో వెంకటేష్ సందడి

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బాల నటి సారా

ప్రజాశక్తి,- తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో సైంధవ్ చిత్రం హీరో వెంకటేష్, నటి శద్ధా శ్రీకాంత్ లు సోమవారం సందడి చేశారు. టాలివుడ్ చిత్రం సైంధవ్ లోని సరదా సరదాగా అనే పాటను విద్యార్థుల కేరింతల మధ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రం టీజర్ ను కూడా ప్రదర్శించి విద్యార్థులను అలరించారు. చిత్రం దర్శకుడు హిట్ ఫేం శైలేష్ కొలను మాట్లాడుతూ హీరో వెంకటేష్ కాంపౌండ్ నుంచి వస్తున్న చిత్రం సైంధవ్ చిత్రం 2024 జనవరి 13న సంక్రాంతి కానుకగా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. ఈ సందర్భంగా టాలీవుడ్ నటుడు వెంకటేష్ మాట్లాడుతూ సైంధవ్ చిత్రం తనకు 75వ సినిమాగా చెప్పారు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్ లో తెరకెక్కుతున్న సైంధవ్ చిత్రం ప్రేక్షకుల మన్ననలను అందుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత వెంకట్ బొయిన పల్లి, వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాల నటి సారా

వివిఐటిలో ఘనంగా బాలల పండుగ

ప్రజాశక్తి-తెనాలి

బాలల పండుగ బాలోత్సవ్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరులో మూడు రోజుల పాటు నిర్వహించనున్న బాలోత్సవ్‌లో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు విశేషంగా పాల్గొంటున్నారు. అతిధులు, ఆహ్వానితులతో ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన వంటి 20 అంశాలలో 61 విభాగాలుగా పోటీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో దానికి తగిన రీతిలో విద్యార్థులు సందడి చేస్తున్నారు. వివిఐటి ప్రాంగణంలో సోమవారం ఆ సంస్థ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, కొత్తగూడెం బాలోత్సవ్ వ్యవస్థాపకులు వాసిరెడ్డి రమేష్‌బాబు, ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ రావెల సాంబ శివరావు, ఏపి ఎస్ఆర్‌టిఎస్ ప్రతినిధి డి.శివ రామరాజు ముఖ్య అతి ధులుగా పాల్గొని బెలూన్లు ఎగురవేసి ఉత్స వాలను ప్రారంభి

వివిధ ప్రాంతాల నుంచి బాలోత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులు

అలరించిన హీరో విక్టరీ వెంకటేష్

దేశం నలుమూలల నుండి వచ్చిన విద్యార్థులతో ప్రపంచ తెలుగబాలల పండుగ వివిఐటి బాలోత్సవ్ 2023 వేడుకలు నంబూరులో వివిఐటి లో కోలాహలంగా సాగాయి. ఈ వేడుకల్లో హీరో విక్టరీ వెంకటేష్ నటించిన సైంధవ్ చిత్ర యూనిట్ చిన్నారులతో ఆడిపాడి అలరించింది. ఈ సందర్భంగా హీరో వెంకటేష్ మాట్లాడుతు చిన్నారులు ఎల్లప్పుడూ మంచిగా ఆలోచించాలని, చదువును నిర్లక్ష్యం చేయకుండా మంచిగా రాణించాలి కోరారు. ఇతరులు మీపైన ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. సైంధవ్ చిత్రంలోని పాటను చిన్నారుల మధ్య విడుదల చేశారు.

ంచారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు, వారిని మరింతగా ప్రోత్సహించేందుకు ఇలాంటి ఉత్సవాలు దోహదం చేస్తాయన్నారు. వి.రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల మేథాశక్తికి పదును పెట్టేందుకు, వారిని పోటీ ప్రపంచానికి ధీటుగా సిద్ధం చేసేందుకు, వారిలో మానసికంగా ఉత్తేజాన్ని రేకిత్తేంచేందుకు ఉత్సవాలు మరింత ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. డాక్టర్ రావెల సాంబశివరావు మాట్లాడుతూ గెలుపు ఓటములతో ప్రమేయం లేకుండా ఉత్సవాల్లో పాల్గొనటమే ముఖ్యమని, ఆ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

బాలోత్సవ్‌ను ప్రారంభిస్తున్న అతిధులు

విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. డాక్టర్ దండు శివరామరాజు మాట్లాడుతూ విభిన్న ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఒక వేదికను పంచుకోవటం ద్వారా ఆయా ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునే వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందాలు, వివిఐటి విద్యార్థులు సమిష్టిగా విద్యార్థులను స్వాగతించారు. భోజన వసతి సౌకర్యాలలో సహ కారాన్ని అందిం చారు. కార్యక్ర మాలను కళాశాల అధ్యాపక బృందం పర్యవేక్షించారు.

సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థిని

తుపాను బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ స్పందనకు 190 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి , డీఆర్ఓ కే. చంద్రశేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్ర రావు, లక్ష్మీ కుమారి , ఆర్డీఓ పి. శ్రీఖర్ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 190 అర్జీలను స్వీకరించారు. పెండింగ్ అర్జీలపై జెసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, పీడీ హౌసింగ్ వేణుగోపాల్ , సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, డియంఅండ్ హెచ్ డాక్టర్ శ్రావణబాబు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

ప్రత్తిపాడు మండలం, కొండేపాడులోని ఎస్సీ కాలనీకి స్మశాసన వాటికకు స్థలం చూపించాలని కాలనీ వాసులు స్పందనలో అర్జీ అందచేశారు. గత అనేక సంవత్సరాలుగా వాగు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఖననం చేస్తుండే వాళ్లమని, అదీ కూడా వాగులు పొంగితే ఖననం చేయటానికి వీలు లేక రెండు, మూడు రోజులు ఇంట్లోనే భౌతిక ఖాయాన్ని ఉంచుకోవాల్సి వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం జగనన్న భూ సర్వేలో భాగంగా ఆ భూమిన పట్టాదారులది అయ్యిందని, ఇప్పుడు అక్కడ ఖననం చేయటానికి అవకాశం లేదన్నారు. కావున తమకు స్మశాన వాటిక ఏర్పాటుకు ప్రత్యామ్నాయ స్థలం చూపించాలని విజ్ఞప్తి చేశారు. అర్జీ ఇచ్చిన వారిలో మన్నవ బాబూరావు, ఎ.భాస్కరరావు, మోపర్తి కోటేశ్వరరావు, ఎన్.కుమార్‌బాబు తదితరులు ఉన్నారు.

రైతు నాయకులపై అక్రమ నిర్బంధం విడనాడాలి

సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు యుధ్వీర్‌సింగ్‌పై అక్రమ నిర్బంధం, ప్రయాణంపై నిషేధం తొలగించాలని, సంయుక్త కిసాన్ మోర్చాకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు కోరారు. ఈమేరకు ఆయా డిమాండ్లతో కూడిన లేఖను రాష్ట్రపతికి పంపించాలని కోరుతూ స్పందనలో అందచేశారు. ఢిల్లీ రైతు పోరాటం సందర్భంగా ప్రభుత్వం సంయుక్త కిసాన్ మోర్చాకు అనేక హామీలతో కూడిన రాతపూర్వక ఒప్పందాన్ని చేసుకుందన్నారు. పోరాటం సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో రైతులపై పెట్టిన కేసులు ఉపసంహరణకు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్రం హామీ ఇచ్చాయన్నారు. కానీ గత నవంబర్‌లో యుధ్వీర్‌సింగ్‌ను విమానాశ్రయంలో అరెస్ట్ చేశారని తెలిపారు. తక్షణమే యుధ్వీర్‌సింగ్‌పై, రైతు నాయకులపై మోపిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో వివిధ రైతు సంఘాల నాయకులు కె.అజయ్‌కుమార్, కళ్లం రాజశేఖరరెడ్డి, పచ్చల శివాజీ, పి.కోటేశ్వరరావు, కె.శ్రీధర్‌రావు, దుర్గాప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ స్పందనలో 9 అర్జీలు

ప్రజాశక్తి-తెనాలి

ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 9 అర్జీలు నమోదయ్యాయి. సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధ్యక్షతన నిర్వహించిన స్పందనలో డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించినట్లు డిఏవో వెంకటస్వామి తెలిపారు. వాటిలో రెవిన్యూ శాఖకు సంబదించి 4, పురపాలక సంఘానికి సంబందించి 2, డిఆర్‌డిఏ-1, సీనియర్ సిటిజన్స్-1, సాధారణ సమస్యలపై ఒక అర్జీ సమర్పించారని, వాటిని సంబందిత శాఖలకు పంపి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్పందనలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్తీ మిర్చి విత్తనాలతో నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి

మేడికొండూరు మండలంలో సిరిపురం, ఎలవర్తిపాడు, మేడికొండూరు గ్రామాల్లో కల్తీ మిర్చి విత్తనాలు వేసి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు స్పందనలో అర్జీ అందచేశారు. అగ్రి సీడ్స్ వారి ఎస్‌డబ్ల్యూ 45 అనేక రకం, 121245007 అనే లాట్‌లో, బ్యాచ్ నంబర్ 1905236457 ప్యాకెట్‌లో కల్తీ మిర్చి విత్తనాలు వచ్చాయని వివరించారు. దాదాపు 50 ఎకరాల్లో నాటామన్నారు. ఒక్కొక్క ప్యాకెట్ రూ.800 చొప్పున, ఎకరానికి రూ.15వేలు అయ్యిందన్నారు. అయితే నాలుగు నెలలైనా పిందెలు రావట్లేదని గమనించి, నవంబర్‌లో అధికారులకు తెలియజేశారన్నారు. ఇప్పటికీ వ్యవసాయ ఖర్చులు,, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కౌలు, సాగు ఖర్చులన్నీ సుమారు రూ.85వేలు అయినట్లు తెలిపారు.ప్రభుత్వం శాస్త్రవేత్తలను పంపించి, పరీక్షలు చేసి, నివేదిక వెంటనే విడుదల చేయాలని, కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.1.50 లక్షలు పరిహారం ఇవ్వాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, రైతులు నందా రామారావు, పి.వీరరాఘవయ్య, ఎస్.సుభాని, ఎన్.పూర్ణచంద్రరావు తదితరులు ఉన్నారు.

తుపాను బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలి

మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులు, కౌలురైతుందర్ని గుర్తించి తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు స్పందనలో అర్జీ అందచేశారు. జిల్లాలో రెండున్న లక్షల ఎకరాల్లో పంట జరిగిందని, వరి, మిర్చి, అపరాలు, ఉద్యాన పంటలకు రైతులు అధిక పెట్టుబడి పెట్టి భారీగా నష్టపోయారన్నారు. వాణిజ్య పంటలకు కనీసం ఎకరాకు రూ.50వేలు, ఉద్యాన పంటలకు రూ.75వేలు, వరికి రూ.25వేలు పరిహారం ఇవ్వాలని, తిరిగి పంటలు వేసుకోవటానికి విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో వివిధ సంఘాల నాయకులు కె.అజయ్‌కుమార్, కె.రాజశేఖర్‌రెడ్డి, పి.శివాజీ, పి.కోటేశ్వరరావు, కె.శ్రీధర్‌రావు, బి.రామకృష్ణ, యం.శివసాంబిరెడ్డి తదితరులున్నారు.